

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 14-09-2026 | సంపుటి: 3 | సంచిక: 222 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 14-09-2026 | VOLUME : 3 | ISSUE : 222 | PAGES: 8 | COST: 2/- |

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




## ముగిసిన బ్రిక్స్ సదస్సు..

### ఫలితాల దిశగా కీలక అడుగులు

- 21 దేశాల అధినేతలు, ప్రతినిధులకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు సభ్యదేశాల ఆమోదం
- సమ్మిళిత అభివృద్ధికి పరస్పర సహకారం కీలకమన్న మోదీ

దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం ముగిసింది. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విస్తరించిన బ్రిక్స్ కూటమి దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య, ఆహార భద్రత, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. సభ్యదేశాలు 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించాయి.

మిగతా 3వ పేజీలో..






## ఆత్మగౌరవ భవనం..

# ఆర్యవైశ్యుల ఐక్యతకు ప్రతీక



- పేదరికం ఉన్నా ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చే సమాజం
- ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్
- రోశయ్య సేవలను గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి
- గాంధీ, పొట్టి శ్రీరాములు త్యాగాలు దేశానికి స్ఫూర్తి
- భవన నిర్మాణానికి ప్రభుత్వ సహకారం..
- రాజకీయ ప్రాధాన్యంపై పిలుపు

### ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్యుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 13

**ఆత్మగౌరవానికి ప్రాధాన్యం**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. సమాజంలో ఎంతోమంది పేదలు ఉన్నప్పటికీ.. తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ జీవించడానికే వారు ప్రాధాన్యమిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అవసరమైనప్పుడు అప్పు ఇచ్చే గుణం ఆర్యవైశ్యుల్లో ఉందని పేర్కొన్నారు. ఊరిలో ఏ శుభకార్యం జరిగినా ఆర్యవైశ్య సోదరులు గుర్తుకొస్తారని చెప్పారు. ప్రపంచంలో వ్యవసాయం, వ్యాపారం రెండే ప్రధాన వృత్తులని.. తాను ఎప్పటి నుంచో ఆర్యవైశ్యుల శ్రేయోభిలాషినేనని సీఎం తెలిపారు.

**రోశయ్య సేవలకు గుర్తింపు**

చెన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రులుw

మిగతా 2వ పేజీలో..

## విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఆటంకాలు తొలగాలి



- తెలంగాణ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డి

## బ్రిక్స్ విందుపై రాహుల్ విమర్శలు



- శిఖరాగ్ర సదస్సు విందులో పూర్తిగా శాకాహార వంటకాలు
- 80 శాతం భారతీయులు మాంసాహారులేనన్న రాహుల్

2



వినాయక చవితి సందర్భంగా నేడు కార్యాలయానికి సెలవు. కావున రేపు (మంగళవారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

## ఖమ్మంలో జనసేన శంఖారావం



- తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యాచరణ
- గడల శ్రీనివాసరావు విజయానికి కార్యకర్తలకు పిలుపు

3



3

## తెలంగాణ రక్షణ సేనలోకి నాగోబా ప్రధాన పూజారి

- మేస్రం ఆనందరావుకు కండువా కప్పి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత
- పలువురు సర్పంచులు, ముఖ్య నాయకుల చేరిక
- ఆదివాసీ ప్రాంతాల్లో పార్టీకి మరింత బలం
- ఈ నెల 20న కొడంగల్ కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ

## 11 రోజుల దర్యాప్తు.. నీడల వెంట పోలీసులు



3

- 500 సీసీ కెమెరాల ఫుటేజీను క్షుణ్ణంగా పరిశీలించిన టాస్క్‌ఫోర్స్
- 29, 30వ తేదీ రాత్రి దృశ్యాలపై సెకన్ టు సెకన్ విశ్లేషణ

# 21 రాష్ట్రాల్లో యూసీసీ

- అక్రమ వలసదారులను గుర్తించి ఏరివేస్తామని ప్రకటన
- * మణిపూర్‌లో ఎన్ఆర్సీపై చర్చించి నిర్ణయం
- * మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంపై నెలరోజుల సేవా కార్యక్రమం

**ముంబై, సెప్టెంబర్ 13:**

దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలుపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029లోగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పాలిత 21 రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేస్తామని వెల్లడించారు. ఆదివారం ముంబైలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మతంతో సంబంధం లేకుండా వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి వ్యక్తిగత అంశాలకు ఒకే రకమైన చట్టపరమైన నిబంధనలు వర్తింపజేయడమే యూసీసీ ఉద్దేశమని తెలిపారు.

**రాష్ట్రాల్లో అమలుకు చర్యలు**

ఇప్పటికే పలు బీజేపీ పాలిత రాష్ట్రాలు యూసీసీ చట్టాలను తీసుకొచ్చాయని అమిత్ షా చెప్పారు. మిగిలిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనూ దీనిని అమలు చేస్తామని పేర్కొన్నారు.

**ఉగ్రవాదంపై కఠిన వైఖరి**

దేశ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని అమిత్ షా అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తామని చెప్పారు. అక్రమ వలసదారులను గుర్తించి, ఏరివేస్తామని వెల్లడించారు.

**ఆర్థిక ప్రగతిపై ప్రస్తావన**

2014కు ముందు దేశం అవినీతి, కుల తత్వం, కుటుంబ రాజకీయాలతో ప్రభావితమైందని అమిత్ షా విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనితీరు ఆధారంగా రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు. 'ఇండియా ఫస్ట్' విధానంతో విదేశాంగ, రక్షణ విధానాలకు బలమైన పునాది ఏర్పడిందని పేర్కొన్నారు. ఒకప్పుడు 'ఫ్రాజైల్ ఫైవ్' ఆర్థిక వ్యవస్థగా పరిగణించిన భారత్.. ఇప్పుడు ప్రపంచంలోని టాప్5 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని తెలిపారు. మణిపూర్‌లో ఎన్ఆర్సీ అమలుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**మోదీ సేవా సంకల్ప్ అభియాన్**

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు అమిత్ షా ప్రకటించారు. మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17న కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై స్పందిస్తూ.. భారత్ ప్రజాస్వామ్య దేశమని, ప్రజలు నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవిస్తుందని అన్నారు

# భారత్ నంబర్-1 ఆర్థిక శక్తి!

- ఎదుగుతుందని అంచనా
- ఆసియా వైపు మారుతున్న ప్రపంచ ఆర్థిక కేంద్రం
- భారత్–చైనాల పరస్పర ఆధారిత సంబంధాలు కీలకమని వ్యాఖ్య
- చైనా, ఆసియాన్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాలతో బంధాలు కీలకం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలువురు నిపుణులు పేర్కొన్నారు. తాజాగా అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన ప్రముఖ ఆర్థికవేత్త జేఫ్రీ సాక్స్ భారత్ భవిష్యత్తుపై కీలక అంచనా వేశారు. రాబోయే దశాబ్దాల్లో భారత్ అమెరికా, చైనాలను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

**25 ఏళ్లలో అమెరికాను దాటే అవకాశం**

రాబోయే 25 ఏళ్లలో భారత్ అమెరికాను అధిగమించి ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచే అవకాశం ఉందని జేఫ్రీ సాక్స్ అన్నారు. ఆ తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవతరించవచ్చని అంచనా వేశారు. భారత్ ఆర్థిక వృద్ధికి దీర్ఘకాలికంగా అనుకూల పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు.

**ఆసియా వైపు ఆర్థిక కేంద్రం**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు నిర్ణయాత్మకంగా ఆసియా వైపు మారుతోందని సాక్స్ అభిప్రాయపడ్డారు. భారత్, చైనా రెండూ ప్రపంచ ఆర్థిక శక్తులుగా ఎదుగుతాయని అన్నారు. ఈ క్రమంలో అమెరికా మూడో స్థానానికి పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా ఉన్న ఆసియా తిరిగి అదే స్థానాన్ని దక్కించుకునే దిశగా పయనిస్తోందని చెప్పారు.

**భారత్‌కు చైనా.. చైనాకు భారత్**

భారత్, చైనాలు పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడాల్సిన అవసరం ఉందని జేఫ్రీ సాక్స్ అన్నారు. భారత్‌కు చైనా ఎంత అవసరమో.. చైనాకు భారత్ అంతే అవసరమని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక సంబంధాలు మరింత లోతుగా మారితే భారత్ అభివృద్ధి వేగం మరింత పెరిగే అవకాశముందని తెలిపారు.

**వ్యూహాత్మక బంధాలు కీలకం**

చైనా, ఆసియాన్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాలతో భారత్ వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలు భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయని సాక్స్ అన్నారు. ఈ ప్రాంతాలతో వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం పెరగడం భారత్ ఆర్థిక విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆసియా దేశాల మధ్య పరస్పర సహకారం పెరిగే కొద్దీ ప్రపంచ ఆర్థిక శక్తుల సమీకరణంలోనూ గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని వివరించారు.

# ప్రతీ కుటుంబంలో సంతోషాలు వెల్లివిరియాలి

- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్13:**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తుందని, గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని, వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు. పండుగను కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి జరుపుకోవడం ద్వారా సోదరభావం, సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని టీపీసీసీ చీఫ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించి, ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు.

# ఆత్మగౌరవ భవనం..
# ఆర్యవైశ్యుల ఐక్యతకు ప్రతీక

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక శాఖ వంటి కీలక బాధ్యతలను ఆర్యవైశ్యులకు అప్పగించారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఏర్పడటానికి నాటి ఆర్థిక మంత్రి కె.రోశయ్య ప్రధాన కారణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు తగిన గౌరవం, అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. శాసనమండలిలో తాను ఆవేశంగా మాట్లాడిన సందర్భాల్లో రోశయ్య ఇచ్చిన సూచనలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఎవరినీ నేరుగా విమర్శించకుండా చురకలు వేసే రోశయ్య మాటలను గౌరవిస్తూ హైదరాబాద్ నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

**గాంధీ, పొట్టి శ్రీరాములు త్యాగాలు**

మహాత్మా గాంధీ ఆర్యవైశ్య బిడ్డ కావడం, కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ప్రపంచస్థాయి గుర్తింపు పొందడం గర్వకారణమని రేవంత్‌రెడ్డి అన్నారు.
దేశ సమగ్రత కోసం గాంధీ ప్రాణాలు అర్పించారని, పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. దేశాభివృద్ధిలో అనేకమంది ఆర్యవైశ్య ప్రముఖులు కీలక పాత్ర పోషించినా.. వారికి రావాల్సినంత గుర్తింపు రాలేదని అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వ సహకారం**

ఉప్పల్ భగాయత్‌లో నిర్మించబోయే ఆత్మగౌరవ భవనం పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఉపయోగపడాలని సీఎం ఆకాంక్షించారు. నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీల్లో పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులతో ఇప్పటికే రాజకీయ ప్రాధాన్యత కల్పించామని తెలిపారు. రాజకీయాల్లో ఆర్యవైశ్యులు తమ వాటాను దక్కించుకోవాలని సూచించారు. ముందుచూపు, జాగ్రత్త ఆర్యవైశ్యుల డీఎన్ఏలోనే ఉన్నాయని.. అందరూ ఐక్యంగా ఒకే తాటిపై నడిచినప్పుడే బలం పెరుగుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బండారి లక్ష్మారెడ్డి, ప్రకాష్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్‌యాదవ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్త, మాజీ ఎంపీ మధుయాష్కీతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ఆటంకాలు తొలగాలి

- ప్రజల జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్ష
- గణేష్ మండపాల వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- రద్దీ ప్రాంతాల్లో అత్యవసర సేవలపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- మండపాలకు ఈ ఏడాది కూడా ఉచిత విద్యుత్
- శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి మరింత పెరగాలని ఆకాంక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

వినాయక చవితి సందర్భంగా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని ఆటంకాలు తొలగిపోయి ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని గణపతిని ప్రార్థించినట్లు తెలిపారు. గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల్లో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించుకోవాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పండుగ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే మండపాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖతో పాటు సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**మండపాలకు ఉచిత విద్యుత్**

వినాయక నవరాత్రుల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. గణేష్ మండపాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్ సరఫరాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది కూడా గణేష్ మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా ఆనందోత్సాహాలతో వినాయక చవితిని జరుపుకోవాలని ఆకాంక్షించిన రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి మరింత పెరగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు.

# కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం

- * కొండా మురళికి కీలక బాధ్యతలపై సంకేతాలు వచ్చాయని వెల్లడి
- * వరంగల్ తూర్పులో మళ్లీ గెలుపు.. 24–25 డివిజన్లలో కాంగ్రెస్ విజయం లక్ష్యం



**వరంగల్, సెప్టెంబర్ 13:**

కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమని మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్‌లో భర్త కొండా మురళితో కలిసి పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ఆలోచన లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగామని, ఆ పార్టీతోనే తమ రాజకీయ ప్రయాణం కొనసాగుతుందని పేర్కొన్నారు. గతంలో కొన్ని రాజకీయ పరిస్థితుల కారణంగా బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని, అయినా కాంగ్రెస్‌తో తమ అనుబంధం కొనసాగుతూనే ఉందన్నారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**మంత్రి పదవి కంటే కారణం ముఖ్యం**

మంత్రి పదవి నుంచి తొలగించిన విషయంపై స్పందిస్తూ.. పదవి కోల్పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని సురేఖ అన్నారు. అయితే తనను ఎందుకు తప్పించారో కారణం చెప్పకపోవడం మాత్రమే బాధ కలిగించిందని పేర్కొన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన శాఖలను పారదర్శకంగా నిర్వహించానని తెలిపారు.

**అధిష్ఠానం ఫోన్లు.. మురళికి పదవిపై సంకేతాలు**

పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని సురేఖ వెల్లడించారు. తాను పార్టీ వీడబోనని వారికి స్పష్టం చేసినట్లు తెలిపారు. తన భర్త కొండా మురళికి త్వరలోనే కీలక బాధ్యత లేదా పదవి దక్కే అవకాశాలపై కూడా అధిష్ఠానం నుంచి సంకేతాలు వచ్చాయని చెప్పారు.

**వరంగల్ తూర్పులో మళ్లీ గెలుపు**

రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మళ్లీ పోటీ చేసి విజయం సాధిస్తానని కొండా సురేఖ విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

**స్థానిక నేతలపై విమర్శలు**

కొంతమంది స్థానిక రాజకీయ నాయకులు తమపై అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని సురేఖ మండిపడ్డారు. గత రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. కొందరు నేతలు తమను మోసం చేశారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తామని, భవిష్యత్తులోనూ పార్టీ కోసం కృషి కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# బ్రిక్స్ విందుపై రాహుల్ విమర్శలు

- ఛోలే భటూరే ఫొటోతో సోషల్ మీడియాలో పోస్టు
- భారతీయ వంటకాల రుచిని ప్రస్తావించిన కాంగ్రెస్ నేత
- మోదీ–జిన్‌పింగ్ భేటీపైనా కాంగ్రెస్ ప్రశ్నల వర్షం
- చైనా విషయంలో కేంద్రం వైఖరిని ప్రశ్నించిన జైరాం రమేశ్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

భారత్ ఆతిథ్యమిచ్చిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో భాగంగా దిల్లీలో ఏర్పాటు చేసిన గాలా డిన్నర్ రాజకీయ చర్చకు దారితీసింది. బ్రిక్స్ దేశాల అధినేతలు, ప్రతినిధుల కోసం భారత్ మండపంలో ప్రధాని నరేంద్ర మోదీ ఏర్పాటు చేసిన ఈ విందులో పూర్తిగా శాకాహార వంటకాలనే వడ్డించారు. దీనిపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్‌లో 80 శాతం మంది మాంసాహారులేనని, భారతీయ నాన్‌వెజ్ వంటకాలు ఎంతో రుచికరంగా ఉంటాయని వ్యాఖ్యానించారు.

**ఛోలే భటూరే ప్రస్తావన**

రాహుల్ గాంధీ ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికలపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 80 శాతం మంది భారతీయులు నాన్‌వెజ్ తింటారని పేర్కొంటూ.. భారతీయ వంటకాల్లోని రుచిని ప్రస్తావించారు. తన సోదరి చేసే ఛోలే భటూరేతో పోల్చుతూ వ్యాఖ్యానించారు. దీనికి సంబంధించిన ఫొటోను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో బ్రిక్స్ విందులో శాకాహార మెనూపై రాజకీయ, సోషల్ మీడియా చర్చ మొదలైంది.

**భారతీయ రుచుల ప్రత్యేకత**

బ్రిక్స్ సదస్సుకు వివిధ దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరైన నేపథ్యంలో భారతీయ సంప్రదాయ వంటకాలను పరిచయం చేసేలా గాలా డిన్నర్ మెనూను రూపొందించారు. విందులో స్టార్టర్స్‌గా ఖండ్వీ మిల్లే, ఖుంబ్ గలౌటీ, పుదీనా పెర్ల్స్ వడ్డించారు. ప్రధాన వంటకాల్లో పనీర్ లబాబ్దార్, గుచ్చి మార్మిక్, క్యారెట్ బీన్ పొరియల్ ఉన్నాయి. తక్కాలి బెల్లె సారు, మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రైతా, వివిధ రకాల భారతీయ రొట్టెలను మెనూలో చేర్చారు. డెజర్ట్‌గా ఓల్డ్ దిల్లీ ఫ్రూట్ క్రీమ్ విత్ జిలేబీ, షాహ్‌తూత్ ఫిర్నీ అందించారు.

**మోదీ–జిన్‌పింగ్ భేటీపై కాంగ్రెస్ ప్రశ్నలు**

మరోవైపు బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశంపైనా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. చైనాతో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. చైనా విషయంలో ప్రభుత్వం 'కాలిబ్రేటెడ్ క్యాపిట్యులేషన్' విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించారు. సరిహద్దులో శాంతి, ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ పేరుతో భారత్ తన విధానాల్లో రాజీ పడుతోందని విమర్శించారు.

**గాల్వన్ ఘటనపై ప్రశ్నలు**

2020 జూన్ 15, 16 రాత్రి గాల్వన్ లోయలో చైనా సైనికులతో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ఆ ఘటన తర్వాత జరిగిన అఖిలపక్ష సమావేశంలో 'మన సరిహద్దుల్లోకి ఎవరూ చొరబడలేదు' అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలను ఇప్పటివరకు ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యల ప్రభావం చైనాతో చర్చల్లో భారత్ వెనక్కి తగ్గేలా చేసిందా అని నిలదీశారు.

**పెట్రోలింగ్, అరుణాచల్‌పై నిలదీత**

తూర్పు లద్దాఖ్‌లో భారత్ సంప్రదాయ పెట్రోలింగ్, పశువుల మేత హక్కులను ఎందుకు వదులుకోవాల్సి వచ్చిందని జైరాం రమేశ్ ప్రశ్నించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల పేర్లను చైనా మార్చడంపై కేంద్రం వైఖరిని కూడా నిలదీశారు. బ్రహ్మపుత్ర నదిపై చైనా డ్యామ్ నిర్మాణం చేపడుతున్నా కేంద్రం ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.

**ఆపరేషన్ సిందూర్ అంశంపైనా**

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇచ్చిందని 2025 జూలైలో అప్పటి డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ పేర్కొన్న విషయాన్ని జైరాం రమేశ్ ప్రస్తావించారు.
అనంతరం ఆగస్టు 25న మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. చైనాపై వైఖరిలో మార్పు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. మోదీ-జిన్‌పింగ్ భేటీకి ముందే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన వైఖరిని మార్చిందా అని నిలదీశారు.

**చైనాతో వాణిజ్య లోటుపైనా విమర్శలు**

2025-26 ఆర్థిక సంవత్సరంలో చైనాతో భారత్ వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో 112.6 బిలియన్ డాలర్లకు చేరిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ పరిస్థితి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి బదులుగా 'ఇంపోర్ట్ ఫ్రమ్ చైనా' కొనసాగుతున్నట్లుగా ఉందని విమర్శించారు.

# ముగిసిన బ్రిక్స్ సదస్సు..

- భౌగోళిక, రాజకీయ ఘర్షణల ప్రభావంపై ఆందోళన
- సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చడంపై హెచ్చరిక
- బ్రిక్స్ మూడో దశాబ్దంలో ఆచరణాత్మక ఫలితాలే లక్ష్యం
- తదుపరి బ్రిక్స్ సదస్సు చైనాలో.. అధ్యక్ష బాధ్యతలు అప్పగింత

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13:**

దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ఆదివారం ముగిసింది. భారత్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విస్తరించిన బ్రిక్స్ కూటమి దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య, ఆహార భద్రత, ఇంధనం తదితర రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. సభ్యదేశాలు 45 పేజీల 'న్యూఢిల్లీ డిక్లరేషన్'ను ఏకగ్రీవంగా ఆమోదించాయి. ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. సదస్సుకు హాజరైన దేశాధినేతలు, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో.. ఇకపై ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఆచరణాత్మక ఫలితాలను ఆశిస్తోందని స్పష్టం చేశారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో ఆ దేశానికి శుభాకాంక్షలు తెలిపారు. భారత్ నుంచి చైనాకు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు.

**సమ్మిళిత అభివృద్ధికి సహకారం**

ప్రపంచం ప్రస్తుతం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోందని మోదీ అన్నారు. భౌగోళిక, రాజకీయ ఘర్షణలు పెరగడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, వాతావరణ మార్పులు వంటి పరిణామాల ప్రభావం నేరుగా సామాన్య ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను అధిగమించేందుకు బ్రిక్స్ దేశాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌లోనూ ప్రపంచ దక్షిణ దేశాల అభివృద్ధి, ఆర్థిక సహకారం, ఆహార భద్రత, ఇంధనం, కృత్రిమ మేధస్సు, వాతావరణ చర్యలు, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అంతర్జాతీయ వ్యవస్థలో బహుళ ధ్రువ ప్రపంచానికి మద్దతు, ఐక్యరాజ్యసమితి సంస్కరణల అవసరాన్ని కూడా సభ్యదేశాలు ప్రస్తావించాయి.

**సాంకేతికత, ఖనిజాలపై ఆందోళన**

అత్యాధునిక సాంకేతికత, కీలక ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకునే పరిస్థితులపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచ అభివృద్ధికి ఉపయోగపడాల్సిందే తప్ప.. దేశాల మధ్య ఆధిపత్య పోరులో సాధనంగా మారకూడదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలను కూడా స్థిరంగా, సురక్షితంగా ఉంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

**స్థానిక కరెన్సీల్లో వాణిజ్యానికి ప్రోత్సాహం**

బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత సులభతరం చేయడంపై సదస్సులో దృష్టి పెట్టారు. స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను బలోపేతం చేయడం, బ్రిక్స్ పేమెంట్ టాస్క్‌ఫోర్స్ ద్వారా జాతీయ చెల్లింపు వ్యవస్థల అనుసంధానంపై కసరత్తు కొనసాగించాలని నిర్ణయించారు. బ్రిక్స్ కరెన్సీని ఏర్పాటు చేయడం కంటే ప్రస్తుతం ఆచరణాత్మక ఆర్థిక సహకారంపైనే దృష్టి పెట్టినట్లు డిక్లరేషన్ స్పష్టం చేసింది.

**ఏఐపై ప్రత్యేక దృష్టి**

కృత్రిమ మేధస్సు వినియోగం కూడా సదస్సులో కీలక అంశంగా మారింది. గ్లోబల్ సౌత్ దేశాల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐ అభివృద్ధికి సభ్యదేశాలు మద్దతు ప్రకటించాయి. భారత్ చేపట్టిన ఏఐ సంబంధిత కార్యక్రమాలను డిక్లరేషన్‌లో ప్రస్తావించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్మార్ట్ తయారీ, ఆరోగ్య రంగాల్లో సాంకేతిక సహకారాన్ని పెంచే చర్యలను కూడా భారత్ అధ్యక్షతన ముందుకు తీసుకెళ్లారు.

**ప్రపంచ సమస్యలపై ఉమ్మడి వైఖరి**

మధ్యప్రాచ్య సంక్షోభం, సూడాన్ పరిణామాలు వంటి అంతర్జాతీయ అంశాలపై బ్రిక్స్ దేశాలు ఉమ్మడి వైఖరిని వ్యక్తం చేశాయి. ఉద్రిక్తతలు తగ్గించేందుకు దౌత్యపరమైన పరిష్కారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చాయి. ఏకపక్ష ఆంక్షలు,
వాణిజ్య అవరోధాలపై కూడా ఆందోళన వ్యక్తం చేశాయి. భిన్నమైన భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలున్న దేశాల మధ్య ఈ స్థాయి ఏకాభిప్రాయం సాధించడం సదస్సు కీలక ఫలితాల్లో ఒకటిగా నిలిచింది.

**భారత్-చైనా సంబంధాలపైనా చర్చ**

సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య వ్యాపార, రవాణా సంబంధాలను మెరుగుపరచడంతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించడంపై చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలంటే సరిహద్దుల్లో శాంతి కీలకమని మోదీ స్పష్టం చేశారు.

**బ్రిక్స్ నుంచి ఇక కార్యాచరణ**

బ్రిక్స్ కూటమి విస్తరిస్తున్న కొద్దీ దాని బాధ్యతలు కూడా పెరుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను పెంచడం, ప్రపంచ దక్షిణ దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు తీసుకురావడం వంటి అంశాల్లో బ్రిక్స్ కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కార్యక్రమాలుగా నిర్ణయాలను మార్చాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు

# తెలంగాణ రక్షణ సేనలోకి నాగోబా ప్రధాన పూజారి

- అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు
- ఆదివాసీలను పెద్ద సంఖ్యలో పార్టీలోకి తీసుకురావడంపై దృష్టి

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**



కేస్లాపూర్ నాగోబా దేవాలయ ప్రధాన పూజారి, మేస్రం వంశీయుల పెద్ద మేస్రం ఆనందరావు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు సర్పంచులు, నాయకులు పార్టీలో చేరారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ చేరికతో ఆదివాసీ ప్రాంతాల్లో పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు పేర్కొన్నారు.

**నాగోబాతో కవితకు అనుబంధం**

నాగోబా దేవాలయంతో కల్వకుంట్ల కవితకు ప్రత్యేక అనుబంధం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ ఆమె నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నాయి. ఆలయ ప్రధాన పూజారి మేస్రం ఆనందరావు పార్టీలో చేరడం తమ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని నాయకులు తెలిపారు.

**విస్తరణకు వరుస సభలు**

మేస్రం ఆనందరావుతో పాటు గిన్నెర సర్పంచ్ మేస్రం భీమ్‌రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, పార్టీ సీనియర్ నాయకుడు లోకిని రాజు పాల్గొన్నారు. పార్టీ విస్తరణలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రణాళిక రూపొందిస్తోంది. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగిందని నాయకులు తెలిపారు. ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో మరో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఇంద్రవెల్లిలో భారీ సభ**

అక్టోబర్‌లో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కల్వకుంట్ల కవిత వ్యూహరచన చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు జగిత్యాల జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహం కల్పించడమే లక్ష్యంగా సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. ఆదివాసీలు, ముఖ్యంగా గోండులు, బంజారాలను పెద్ద ఎత్తున పార్టీలో చేర్చుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపాయి. కోస్గి సభ అనంతరం ఇంద్రవెల్లి సభ తేదీని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని నాయకులు తెలిపారు. పార్టీ విస్తరణలో ఈ సభ కీలక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# 11 రోజుల దర్యాప్తు.. నీడల వెంట పోలీసులు

- * అనుమానాస్పద నీడలకూ మ్యాపింగ్.. చివరకు మల్లేష్‌పై ఫోకస్
- * రెండు రోజుల పాటు నిరంతరం నైట్ ఫుటేజ్ పరిశీలన
- * 12 తుపాకులు, 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్ స్వాధీనం
- * మల్లేష్‌పై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**

బొల్లారం మిలటరీ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన ఆయుధాల చోరీ కేసు దర్యాప్తు 11 రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మిలటరీ అధికారులు, రాష్ట్రంలోని వివిధ పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో ఆధారాలను సేకరించాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ నుంచి కీలక ఆధారాలను వెలికితీసిన పోలీసులు చివరకు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్‌ను అనుమానితుడిగా గుర్తించి కేసు మిస్టరీని ఛేదించారు.

**నీడలపై కూడా నిఘా**

దర్యాప్తులో భాగంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారు 500 సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. 29, 30వ తేదీ రాత్రులకు సంబంధించిన దృశ్యాలను సెకన్ టు సెకన్ విశ్లేషించారు. రాత్రి వేళ లైట్ల వెలుతురులో కనిపించిన అనుమానాస్పద నీడలను సైతం వదిలిపెట్టకుండా పరిశీలించారు. దాదాపు 20 నుంచి 30 వరకు నీడలను గుర్తించి వాటి కదలికలను మ్యాప్ చేశారు. అనంతరం అవి మనుషుల నీడలు కాకుండా ఇతర వస్తువులకు సంబంధించినవిగా నిర్ధారించారు. సీసీ కెమెరాల నుంచి లభించిన ఆధారాలను సమయాల వారీగా మ్యాప్ చేస్తూ పోలీసులు అనుమానితుల కదలికలను సరిపోల్చారు. ఈ క్రమంలో మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్‌పై దృష్టి సారించి అతని కదలికలను నిశితంగా పరిశీలించారు. ఒక రాత్రికి సంబంధించిన ఫుటేజ్‌ను విశ్లేషించేందుకు అధికారులు రెండు రోజుల పాటు నిరంతరంగా వీడియోలను పరిశీలించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

**ఆర్మ్స్ యాక్ట్ కింద మరో కేసు**

బొల్లారం మిలటరీ ఆయుధాలు మాయమైన ఘటనపై తొలుత బొల్లారం పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు. మల్లేష్ అరెస్టు అనంతరం దర్యాప్తులో వెలుగుచూసిన ఆధారాల ఆధారంగా అతనిపై ఆర్మ్స్ యాక్ట్ కింద కూడా అభియోగాలు నమోదు చేశారు. అతని నుంచి 12 తుపాకులు, 2 వేల బుల్లెట్లు, నైట్ విజన్ బైనాక్యులర్, మ్యాగజైన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలను కోర్టుకు సమర్పించనున్నారు.

**ఇంకా ఏదైనా కుట్ర ఉందా?**

ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న మల్లేష్‌ను మరోసారి పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఆయుధాలు మాయమైన ఘటన వెనుక మరెవరైనా ఉన్నారా? ఇంకేమైనా కుట్ర జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగించనున్నారు. ఆయుధాల చోరీ మిస్టరీని ఛేదించేందుకు వివిధ దర్యాప్తు విభాగాలు సమన్వయంతో 11 రోజుల పాటు సాగించిన విచారణ పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# అమర జవాన్లకు ఘన నివాళి



- ట్యాంక్‌బండ్‌లో తెలంగాణ విమోచన కమిటీ కార్యక్రమం
- చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత
- ఆపరేషన్ పోలో మాజీ సైనికులకు సన్మానం

**హైదరాబాద్, సెప్టెంబర్ 14:**

ఆపరేషన్ పోలోలో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు తెలంగాణ విమోచన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌లోని యుద్ధ ట్యాంక్ వద్ద ఘన నివాళులర్పించారు. 1948 సెప్టెంబర్ 13న సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆదేశాలతో మేజర్ జనరల్ జె.ఎన్. చౌధురి నాయకత్వంలో ఆపరేషన్ పోలో ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు. తెలంగాణ ప్రజల పోరాటం, సర్దార్ పటేల్ చొరవతో సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందన్నారు.

**చరిత్రను భావితరాలకు అందించాలి**

విమోచన చరిత్రను రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శించారు. ఈ చరిత్రను రాజకీయాలకు అతీతంగా భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. వీరబైరాన్‌పల్లి, అప్పంపల్లి వంటి ప్రాంతాల్లో అమరులైన వారి త్యాగాలు చిరస్మరణీయమని విమోచన కమిటీ చైర్మన్ బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ చరిత్రను భావితరాలకు చాటి చెప్పడమే కమిటీ లక్ష్యమని కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ పోలోలో సేవలందించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సైనికులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో జనసేన శంఖారావం



- * యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై దృష్టి
- * గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం బలోపేతం
- * రాష్ట్రవ్యాప్తంగా శంఖారావం సభలకు ప్రణాళిక
- * ఎన్నికలకు సమాయత్తమవుతున్న జనసేన శ్రేణులు

**ఖమ్మం, సెప్టెంబర్ 13:**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జనసేన తెలంగాణ శంఖారావం' సభ ఖమ్మంలోని ఎంబీ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ప్రారంభమైంది. 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం' వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు హాజరయ్యారు. పార్టీ జెండాలు, నినాదాలతో సభా ప్రాంగణం సందడిగా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, జనసేన అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ జరిగింది.

**భారీ బైక్ ర్యాలీ**

సభకు ముందు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ఎంబీ ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్ మీదుగా సాగిన ర్యాలీలో జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు. పార్టీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

**పార్టీ బలోపేతంపై దృష్టి**

తెలంగాణలో జనసేన విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు నాయకులు తెలిపారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రధానంగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

**శంఖారావం సభలతో విస్తరణ**

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని నాయకులు వెల్లడించారు. ప్రజా సమస్యలపై పోరాటమే జనసేన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణవ్యాప్తంగా నిర్వహించే శంఖారావం సభలు పార్టీ బలోపేతానికి వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఖమ్మం సభతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని, రాబోయే ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తమవుతున్నారని తెలిపారు. సభకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, రాధారం రాజలింగం, తనీష్ అల్లాడి తదితరులు హాజరయ్యారు.

# లక్కీ డ్రా ఇళ్లపై క్లారిటీ



- 6,660 మంది అభ్యర్థుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి
- మిగిలిన వారి పరిశీలన ఈ వారంలోనే పూర్తి
- అర్హులకు త్వరలో అధికారిక కేటాయింపు పత్రాలు
- బ్రోకర్లు, మధ్యవర్తులను నమ్మొద్దని హెచ్చరిక
- లంచాలు, కమీషన్లు చెల్లించొద్దని సూచన
- అధికారిక ఖాతాల్లోనే తొలి విడత చెల్లింపులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజీ గృహాల లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థుల్లో ఇప్పటివరకు 6,660 మంది క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్ తెలిపారు. మిగిలిన అభ్యర్థుల పరిశీలనను కూడా ఈ వారంలోనే పూర్తి చేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా తేలిన వారికి అధికారిక కేటాయింపు పత్రాలు జారీ చేస్తామని వెల్లడించారు.

**లక్కీ డ్రాలో ఎంపికైన వారికి భరోసా**

ఇల్లు కేటాయిస్తారా లేదా అన్న ఆందోళనకు లక్కీ డ్రాలో ఎంపికైన అభ్యర్థులు గురి కావాల్సిన అవసరం లేదని గౌతమ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన, అర్హత నిర్ధారణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతోందని తెలిపారు.

**బ్రోకర్ల మాటలు నమ్మొద్దు**

గృహాల కేటాయింపు ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు బ్రోకర్లు, మధ్యవర్తులు డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గౌతమ్ పేర్కొన్నారు. ఇల్లు మంజూరు చేయిస్తామని, అధికారులతో మాట్లాడి సహాయం చేస్తామని చెబుతున్న వ్యక్తులకు ఎలాంటి లంచం, కమీషన్ లేదా ఇతర రూపంలో డబ్బులు చెల్లించవద్దని లబ్ధిదారులకు సూచించారు.

**తొలి విడత చెల్లింపులపై స్పష్టత**

గృహానికి సంబంధించిన తొలి విడత మొత్తాన్ని చెల్లించాల్సిన అధికారిక బ్యాంకు ఖాతా, చెల్లించాల్సిన మొత్తం, గడువు, ఇతర సూచనలను కేటాయింపు పత్రంతోపాటే తెలియజేస్తామని తెలిపారు. కేటాయింపు పత్రంలో పేర్కొన్న అధికారిక బ్యాంకు ఖాతాకు మాత్రమే నిర్ణీత మొత్తాన్ని చెల్లించాలని సూచించారు. అధికారిక సమాచారం కోసం తెలంగాణ హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ tghb.telangana.gov.inను సందర్శించడంతోపాటు, 040 24603572 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని గౌతమ్ తెలిపారు.

# రూల్స్ ఫాలో అవ్వడం కాదు.. సెట్ చెయ్యాలి: బ్రిక్స్ నేతలతో మోదీ



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13:

గ్లోబల్ సౌత్ దేశాలు ప్రపంచ సంక్షోభాల విషయంలో ముందు వరుసలో ఉన్నప్పటికీ.. నిర్ణయాలు తీసుకునే విషయంలో మాత్రం వెనుక వరుసలో ఉండిపోతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇకపై గ్లోబల్ సౌత్ నిబంధనలు పాటించేవిగానే ఉండకూడదని.. నియమాలు రూపొందించేవిగా ఎదగాలని ఆకాక్షించారు. భిన్నత్వమే బ్రిక్స్ దేశాల బలమని అన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న బ్రిక్స్ వార్షిక సదస్సు (BRICS 2026)లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ఘర్షణలు పెరుగుతున్నాయి. ఆ ప్రభావం సామాన్యుల జీవితాలపై ప్రభావం పడుతోంది. సవాళ్లను సకాలంలో గుర్తించి, చర్యలు తీసుకోవడం ముఖ్యం. అంటువ్యాధుల ముందస్తు హెచ్చరిక వ్యవస్థపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. పరస్పర సహకారంతో ప్రపంచ దేశాలు మరింత అభివృద్ధి సాధించాలి. అయితే.. మన దేశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సమయంలో పర్యావరణానికి ఇబ్బంది కలిగించొద్దు. ఆ రెండింటిని పరస్పర విరుద్ధమైన లక్ష్యాలుగా చూడకూడదు. భారతీయ నాగరికత ఎప్పటినుంచో ప్రకృతిని తల్లిగా భావిస్తూ.. మానవాభివృద్ధికి, పర్యావరణానికి మధ్య సమతుల్యతను పాటిస్తోంది. ఇది భవిష్యత్తు తరాల పట్ల మన బాధ్యతను తెలియజేస్తోంది' అని మోదీ పేర్కొన్నారు.

**బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్..**

అన్ని దేశాలు కలిసి, బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని ప్రధాని మోదీ ప్రతిపాదించారు. ప్రత్యేక స్టార్టప్ నిధులు ఉండడం వల్ల బ్రిక్స్ దేశాలలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తల మధ్య మరింత సహకారం పెరిగే అవకాశం ఉందన్నారు.

**జిన్‌పింగ్ సమక్షంలోనే.. అరుదైన ఖనిజాల అంశం..!**

సాంకేతికతను, సంక్లిష్ట ఖనిజాలను చూపి బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి చర్యలు సమష్టి వృద్ధికి అడ్డంకులు సృష్టిస్తాయని పరోక్షంగా చైనాను ఉద్దేశిస్తూ పేర్కొన్నారు. అరుదైన ఖనిజాలపై చైనా ఆధిపత్యం చెలాయిస్తున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అక్కడే ఉండడం గమనార్హం. కాగా ప్రపంచంలోని అరుదైన ఖనిజాలలో సుమారు 90శాతం చైనానే ప్రాసెస్ చేస్తుంది. ఈ ఖనిజాలు సోలార్ ప్యానెళ్ల నుంచి స్మార్ట్‌ఫోన్‌ల వరకు అన్నింటిలోనూ ఉపయోగిస్తారు. గతేడాది అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో.. ఈ అరుదైన ఖనిజాల ఎగుమతిపై నిబంధనలను చైనా కఠినతరం చేసింది. తర్వాత ఆ ఆంక్షలలో కొన్నింటిని సడలించింది.

# ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు సహకరిస్తామన్న మోదీ, జిన్‌పింగ్.. స్వాగతించిన పుతిన్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13:

రష్యా‌ఉక్రెయిన్ మధ్య యుద్ధం అంతులేకుండా సాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య శాంతి చర్చలకు ఇండియా, రష్యా ప్రతిపాదించాయి. రెండు దేశాల మధ్య శాంతి స్థాపనలో తాము సహకరిస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిపాదించారు. ఈ నిర్ణయాన్ని రష్యన్ ప్రెసిడెంట్ పుతిన్ స్వాగతించారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావనకు వచ్చింది. దీంతో తాము శాంతికి సహకరిస్తామని మోదీ, జిన్‌పింగ్ సూచించారు. ఈ విషయాన్ని రష్యా వెల్లడించింది. రష్యా అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఆదివారం వెల్లడించారు. రష్యా‌ఉక్రెయిన్ మధ్య శాంతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా వివిధ ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రయత్నాలు ఏవీ సత్ఫలితాల్ని ఇవ్వలేదు. ఈ తరుణంలో మోదీ, జిన్‌పింగ్ ముందుకు రావడం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కీలక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది.ఎందుకంటే రష్యాలో సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత జరుగుతున్న తొలి పార్లమెంట్ ఎన్నికలు ఇవి. ఇలాంటి సమయంలో ఉక్రెయిన్ యుద్ధం అంశం కీలకంగా మారుతుంది. అక్కడి ఎన్నికల్లో పుతిన్‌కు చెందిన ద యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో తాము శాంతి కోసం సహకరిస్తామని ఇండియా కూడా ఎప్పటినుంచో చెబుతోంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇదే విషయానికి కట్టుబడి ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే ట్రంప్.. తన ప్రతినిధుల్ని శాంతి చర్చల కోసం పుతిన్ వద్దకు పంపించారు. కానీ, ఈ చర్చలు సఫలం కాలేదు. అయితే, మోదీ, జిన్‌పింగ్ జోక్యంతో శాంతి ప్రతిపాదన అంశం ముందుకు సాగుతుందేమో చూడాలి.



# చైనా అధ్యక్షుడి విమానం శతృదుర్భేద్యం.. అది గాల్లో ఎగిరే కోట..!




న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13:

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారిక పర్యటనలకు ఉపయోగించే విమానం కేవలం ఒక రవాణా సాధనం మాత్రమే కాదు. దాన్ని గాల్లో తేలియాడే ఒక అభేద్యమైన కోటగా, అత్యాధునిక మొబైల్ కమాండ్ సెంటర్‌గా చెప్పవచ్చు. ఎయిర్ చైనా సంస్థ నిర్వహించే ఈ బోయింగ్ 7478 ఇంటర్‌కాంటినెంటల్ విమానాన్ని చైనా అత్యున్నత స్థాయి నేతల ప్రయాణాల కోసం వినియోగిస్తున్నారు. అత్యవసర సమయాల్లో ఆదేశాలు జారీచేసే కేంద్రంగా పనిచేసేలా దాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ విమానంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చారు. దాంతో ఈ భారీ విమానంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.ఈ విమానం ఒకప్పుడు ఎయిర్ చైనాకు చెందిన సాధారణ వాణిజ్య విమానం. 2014 చివర్లో ప్రయాణికుల సేవలో ప్రవేశపెట్టారు. కానీ కేవలం కొన్ని నెలలకే అంటే మే 2015లో దీనిని శాశ్వతంగా వాణిజ్య సేవల నుంచి ఉపసంహరించారు. ఆ తర్వాత దీనికి అత్యాధునిక భద్రతా వ్యవస్థలను, విలాసవంతమైన వీఐపీ ఇంటీరియర్‌ను అమర్చేందుకు నెలల తరబడి విస్తృతమైన మార్పులు చేశారు. అన్ని మార్పుల తర్వాత 2016 శరదృతువులో ఇది చైనా అధ్యక్షుడి ప్రాథమిక అధికారిక విమానంగా సేవలు ప్రారంభించింది.

**భద్రతా సాంకేతికత**

ఈ విమానంలో ప్రపంచంలోనే అత్యుత్తమ భద్రతా సాంకేతికతను అమర్చారు. ప్రభుత్వ, సైనిక కమాండ్ సెంటర్లతో అధ్యక్షుడు నిరంతరం టచ్‌లో ఉండేందుకు వీలుగా మిలిటరీగ్రేడ్ ఎన్‌క్రిప్టెడ్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉన్నాయి. శత్రు క్షిపణులను పసిగట్టి, వాటిని దారి మళ్లించే రక్షణ వ్యవస్థలు దీని సొంతం. అన్నింటికంటే ముఖ్యంగా దీనిలో ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ పల్స్ (EMP) షీల్డింగ్ టెక్నాలజీ ఉంది. అణుదాడి జరిగినప్పుడు వెలువడే శక్తివంతమైన విద్యుదయస్కాంత తరంగాల నుంచి విమానంలోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ వ్యవస్థలను ఇది కాపాడుతుంది. అంటే అణు యుద్ధం స్థాయిలోనే ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జరిగినా ఈ విమానం చెక్కు చెదరకుండా పనిచేస్తూనే ఉంటుంది.

**పటిష్ఠమైన నిర్మాణం**

గతంలో చైనా నేతలు విదేశీ పర్యటనలకు వెళ్లేటప్పుడు సాధారణ వాణిజ్య విమానాలనే తాత్కాలికంగా మార్పులు చేసి వాడేవారు. పర్యటనకు 20 రోజుల ముందు విమానాన్ని తీసుకుని అందులో సోఫాలు, పడకలు అమర్చి వీవీఐపీ క్యాబిన్‌గా మార్చేవారు. పర్యటన ముగిశాక తిరిగి సాధారణ విమానంగా మార్చేసేవారు. ఇది ఖర్చును ఆదాచేసే పద్ధతి. 2001లో అమెరికాలో ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించుకున్న అధ్యక్ష విమానంలో 27 గూఢచర్య పరికరాలు ఉన్నట్లు కథనాలు రావడం చైనాను అప్రమత్తం చేసింది. ఆ సంఘటన తర్వాతే తమ దేశాధినేతల భద్రత విషయంలో చైనా మరింత కఠినంగా వ్యవహరించడం మొదలుపెట్టింది. ప్రస్తుతం జిన్ పింగ్ ఉపయోగిస్తున్న ఈ ప్రత్యేక విమానం పొడవు 76.4 మీటర్లు. ఇది గంటకు 982 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఒక్కసారి ఇంధనం నింపితే సుమారు 14,500 కిలోమీటర్లు ఆగకుండా ప్రయాణించగలదు. ఈ విమానాన్ని కేవలం చైనా అధ్యక్షుడు, స్టేట్ కౌన్సిల్ ప్రీమియర్ మాత్రమే ఉపయోగించడానికి అనుమతి ఉంది. ఇతర నేతలు చార్టర్డ్ విమానాల్లో ప్రయాణిస్తారు. ఒకప్పుడు ఖర్చు తగ్గించుకునేందుకు సాధారణ విమానాలు వాడిన చైనా, ఇప్పుడు ప్రపంచవేదికపై తన పెరిగిన ప్రాబల్యానికి, భద్రతపట్ల తనకున్న నిబద్ధతకు చిహ్నంగా ఈ 'ఎగిరే కోట' ను వినియోగిస్తోంది.

# నా తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నా: నితిన్ గడ్కరీ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13:

రోడ్ల పరిస్థితి, ట్రాఫిక్ కష్టాలపై కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయిలో ఇండోఅమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (IACC) శనివారం నిర్వహించిన 22వ ఇండోఅమెరికన్ కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డుల కార్యక్రమంలో గడ్కరీ పాల్గొన్నారు. సమావేశానికి గంట ఆలస్యంగా వచ్చినందుకు అక్కడి వారికి క్షమాపణలు చెప్పారు. తాము ముందుగానే బయల్దేరినప్పటికీ.. ట్రాఫిక్ సమస్యల వల్ల ఆలస్యమయ్యిందన్నారు. తన తప్పునకు మూల్యం చెల్లించుకుంటున్నానని పేర్కొనడంతో కార్యక్రమంలో నవ్వులు విరిశాయి.'ఈ కార్యక్రమానికి గంట ఆలస్యంగా వచ్చాను. ఎందుకంటే నేను వర్లీ ప్రాంతం నుంచి ఈ హోటల్‌కు వచ్చేటప్పుడు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. నిజానికి నేను చేసిన తప్పునకు మూల్యం చెల్లిస్తున్నాను. ఎందుకంటే 19952000 మధ్య నేను మహారాష్ట్ర మంత్రిగా పనిచేసినప్పుడు 55 ఫ్లైఓవర్లు, బాంద్రావర్లీ సీ లింక్, ముంబయిపుణె ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మించే అవకాశం వచ్చింది. కానీ, ఆ సమయంలో సరైన సాంకేతికత అందుబాటులో లేనందున వాటిని చేపట్టలేకపోయాం. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగేకొద్దీ.. దశాబ్దాల క్రితం రూపొందించిన మౌలిక సదుపాయాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి' అని గడ్కరీ పేర్కొన్నారు.భారత్‌అమెరికా మధ్య కుదిరిన సాంకేతిక సహకారంతో దేశం ఎదుర్కొంటున్న అనేక అభివృద్ధి సవాళ్లు పరిష్కారమవుతాయని గడ్కరీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి, పాత ఫ్లైఓవర్లు మార్చడం, అధునాతన నిర్మాణ సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం కేవలం సంప్రదాయ డిజైన్లపైనే ఆధారపడకుండా.. కొత్త సాంకేతికత ఆధారిత నిర్మాణాలతో భర్తీ చేయాలని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు సలహా ఇచ్చినట్లు తెలిపారు.

**భారత్ సామర్థ్యాలు.. అమెరికా వనరులు**

పుణెలో రూ.50వేల కోట్ల విలువైన ప్రతిపాదిత మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌ను ప్రస్తావిస్తూ.. ఒకే సెట్ పిల్లర్లపై అనేక స్థాయిల ఫ్లైఓవర్లను నిర్మించడానికి మలేషియా సాంకేతికతను అవలంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సాంకేతికతతో అదే ఫ్లైఓవర్‌పై మెట్రో కారిడార్ సైతం ఏర్పాటు చేయడానికి వీలుంటుందన్నారు. ఇటువంటి బహుళస్థాయి మౌలిక సదుపాయాలు నగరాల్లో పెరుగుతున్న రద్దీ, రవాణా అవసరాలకు మెరుగైన పరిష్కారాన్ని అందించగలవన్నారు. భారత్ సామర్థ్యాలను అమెరికా వనరులు, సాంకేతిక నైపుణ్యంతో మేళవించి దేశంలోని వివిధ రంగాలను మరింత అభివృద్ధి చేయొచ్చన్నారు.



# అమెరికాకంటే ముందే భారత్‌పై బిన్ లాడెన్ దాడి ప్లాన్



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 13:

అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ ఇండియాపై దాడికి కుట్ర పన్నినట్లు తాజాగా వెల్లడైంది. అది కూడా అమెరికాపై సెప్టెంబర్ 11న దాడికి ముందే ఇండియాలో కూడా దాడి చేయాలని ప్లాన్ చేసినట్లు తేలింది. అమెరికాపై దాడి జరిగి 25 ఏళ్లు పూర్తైన సందర్భంగా అమెరికాకు చెందిన నిఘా సంస్థ సీఐఏ.. ఒసామా బిన్ లాడెన్‌కు సంబంధించిన కీలక వివరాల్ని వెల్లడించింది. 100 పేజీలకు పైగా ఉన్న నివేదికను విడుదల చేసింది.1998 నుంచి సేకరించిన సమాచారం ఇది. బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్ పేరుతో వచ్చిన ఈ నివేదిక ప్రకారం.. బిన్ లాడెన్ ఇండియాతోపాటు ఈజిప్ట్, అరేబియా దేశాలు, ఉగాండా వంటి పలు దేశాలపై దాడికి ప్లాన్ చేశాడు. 1998 సమయంలోనే ఈ దాడులు చేయాలని ప్లాన్ చేసినట్లు వెల్లడైంది. అది కూడా అమెరికాపై దాడులకు ముందే. అయితే, ఇండియాలో ఎప్పుడు దాడి చేయాలనుకున్నాడు.. ఎక్కడ, ఎలా దాడి చేయాలనుకున్నాడు వంటి అంశాల్ని ఈ నివేదికలో పేర్కొనలేదు. నివేదిక ప్రకారం లాడెన్ ఉగ్ర నెట్‌వర్క్ దాదాపు 50 దేశాల్లో విస్తరించి ఉంది. ఆఫ్ఘనిస్తాన్ నుంచి లాడెన్ తన ఉగ్రకార్యకలాపాల్ని సాగించాడు. అదే సమయంలో అమెరికా జరిపిన మిస్సైల్స్ దాడుల నుంచి అతడు తప్పించుకున్నాడు. 1998లో ఆఫ్ఘనిస్తన్‌లోని అల్‌ఖైదా స్తావరాలపై అమెరికా దాడి చేసింది. అల్‌ఖైదాను స్థాపించింది బిన్ లాడెన్ అనే సంగతి తెలిసిందే. అనంతరం మూడేళ్లకు.. అంటే 2001లో సెప్టెంబర్ 11న అమెరికాలోని న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్స్‌కు చెందిన ట్విన్ టవర్స్‌పై విమానాలతో అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడి చేసిన సంగతి తెలిసిందే.ఈ దాడిలో దాదాపు మూడు వేల మంది మరణించారు. 19 మంది హైజాకర్లు కూడా మరణించారు. అప్పటినుంచి లాడెన్ కోసం అమెరిగా గాలిస్తూనే ఉంది. చివరకు 2011, మే 2న పాకిస్తాన్‌లో దాక్కున్న లాడెన్‌ను అమెరికా సైన్యం చంపేసింది. దీంతో నెమ్మదిగా అల్ ఖైదా కార్యకలాపాలు స్తంభించాయి.

### చేపలు ఉన్న చెరువులో వినాయక నిమజ్జనం చేస్తే

# నష్టపరిహారం చెల్లించాలి

### లేదంటే నిమజ్జనం అడ్డుకుంటాం : ద్వంసలాపురం పెద్ద చెరువు మత్స్యకారులు



ఖమ్మం, రాజముద్ర న్యూస్

చేపల పెంపకం జరుగుతున్న ద్వంసలాపురం పెద్ద చెరువులో మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించకుండా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయవద్దని కొత్తగూడెం మత్స్యకారుల సొసైటీ సభ్యులు పగడాల మల్లేష్, అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిమజ్జనం వల్ల చేపలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, తమ జీవనోపాధి దెబ్బతింటుందని అన్నారు. చెరువులో చేపల పెంపకానికి ప్రభుత్వానికి పన్ను చెల్లిస్తున్నామని, చెరువుపై ఆధారపడి సుమారు 80 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు.చెరువులో చేపల పెంపకానికి సభ్యులు ఒక్కొక్కరు లక్ష పైన అప్పులు తెచ్చి సుమారు కోటి రూపాయలు ఖర్చు చేశామని, గతంలో ఖమ్మం నగరంలోని కలుషిత నీరు చెరువులోకి రావడంతో టన్నుల కొద్దీ చేపలు చనిపోవడం జరిగిందని, గత మూడు సంవత్సరాలుగా చేపలు పట్టేందుకు వీలులేకుండా మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు చెరువంతా గుర్రపు డెక్కతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు చెరువులో నిమజ్జనం చేస్తే విగ్రహాల వల్ల చెరువులో నీళ్లు విషపూరితమై చేపలన్నీ మృత్యువాత పడతాయని, మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. అదేవిధంగా విగ్రహాలలో ఉండే ఇనుప చువ్వలు మత్స్యకారులకు గుచ్చుకునే ప్రమాదం లేకపోలేదని, పంట పొలాలకు, మూగజీవాలకు కూడా నిమజ్జనం వల్ల ప్రమాదమేనని, ముఖ్యంగా చెరువు పరిసర ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు వాడే గ్రౌండ్ వాటర్ విషపూరితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వినాయక నిమజ్జనాన్ని ద్వంసలాపురం పెద్ద చెరువు కాకుండా వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు. ఒకవేళ చేపలు ఉన్న చెరువులోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి వస్తే, ముందుగా మత్స్యకారులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించకుండా చెరువులో నిమజ్జనం చేపడితే తాము నిమజ్జనాన్ని అడ్డుకుంటామని ద్వంసలాపురం మత్స్యకారుల కొత్తగూడెం సొసైటీ సభ్యులు హెచ్చరించారు.ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్యపై వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ నిమజ్జన ప్రాంతాలను ఏర్పాటు చేయాలని, తమ జీవనోపాధికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు పగడాల శ్రీను, కార్యదర్శి పోతురాజు వెంకటేశ్వర్లు, సభ్యులు నాగటి శేషయ్య, మాకనబోయిన నాగేశ్వరరావు, రాంబాబు, చాగంటి శ్రీను, దుగ్యాల వెంకన్న, గొడుగు రాము, నాగటి వెంకన్న, పగడాల వెంకటేశ్వర్లు, లింగనబోయిన బాబు, నాగటి హనుమంతరావు, సలెంద్ర గోపి, మాకనబోయిన పార్వతి, దంతాల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన నామ

**ఖమ్మం, సెప్టెంబర్ 13 :** వినాయక చవితి సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మట్టి, విత్తన గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

# భారీ సెల్లార్లు.. అక్రమ బహుళ అంతస్తులు..?

- ఆల్విన్ కాలనీలో నిబంధనలకు పాతర వేస్తూ అక్రమ నిర్మాణం..
- ప్రాణాలు పోయాక విచారణలా?
- ప్రమాదాలు జరిగాక నివేదికలు రాయడం కాదు, ముందే చర్యలు తీసుకోవచ్చు : స్థానికులు
- టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటమా?
- 'హైడ్రా' కొరడా కి ముందే చర్యలు ఉండవా..?

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్ విజయనగర్ కాలనీ పైప్ లైన్ రోడ్డు మెయిన్ రోడ్డు పక్కనే దర్జాగా సాగుతున్న అక్రమ నిర్మాణం స్థానికుల గుండెల్లో గుబులు రేపుతోంది. నిబంధనల ప్రకారం కనీసం ఒకట్రెండు అంతస్తులకే అనుమతి ఉండే చిన్న విస్తీర్ణంలో, ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తూ భారీ ఎత్తున సెల్లార్ తవ్వి, బహుళ అంతస్తుల భవనాన్ని రేయింబవళ్లు నిర్మిస్తున్నారు. ఒక భవనం కూలిపోయినప్పుడు లేదా భారీ ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసినప్పుడు మాత్రం ఉన్నతాధికారులు హుటాహుటిన వచ్చి, 'ఇక్కడ ఏం జరిగింది? భవనం ఎలా కూలింది?' అంటూ విచారణల పేరిట మొసలి కన్నీరు కార్చడం పరిపాటిగా మారింది. ప్రమాదాలు జరిగాక నివేదికలు రాయడం కాదు, అసలు అనుమతి లేని ఇలాంటి ప్రమాదకర నిర్మాణాలపై ప్రారంభంలోనే కఠిన చర్యలు తీసుకుంటే అమాయకుల ప్రాణాలకు ముప్పు ఎందుకు వాటిల్లుతుందనే కనీస స్పృహ టౌన్ ప్లానింగ్ సిబ్బందికి లేకపోవడం శోచనీయం.



**అధికారుల కళ్లముందే నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యానికి ఆల్విన్ కాలనీలోని ఈ అక్రమ నిర్మాణమే సజీవ సాక్ష్యం.**

నివాస ప్రాంతాల్లో భారీ సెల్లార్ల తవ్వకం పక్కనే ఉన్న పురాతన భవనాలకు, రహదారులకు ఎంత ప్రమాదకరమో తెలిసినా మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర వీడటం లేదు. పచ్చటి తెరలు కప్పి గుట్టుచప్పుడు కాకుండా పనులు సాగిస్తుంటే, ఆ మార్గంలో నిత్యం తిరిగే స్థానిక క్షేత్రస్థాయి అధికారులకు ఈ అక్రమాలు కనిపించడం లేదా? లేక అన్నీ తెలిసి కూడా అందినకాడికి ముడుపులు మింగి, కళ్లకి గంతలు కట్టుకుని అనుమతుల ఉల్లంఘనను ప్రోత్సహిస్తున్నారా అనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు, అక్రమ కట్టడాలపై 'హైడ్రా' బుల్డోజర్లతో కొరడా ఝుళిపిస్తుంటే.. ఆ స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు వెళ్లి వారు రంగంలోకి దిగేంతవరకు స్థానిక అధికారులు చేతులు ముడుచుకుని కూర్చోవడం సిగ్గుచేటు. హైడ్రా దాడులు చేసేవరకు వేచి చూడకుండా, సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగం వెంటనే మేల్కొని ఇలాంటి నిబంధనలకు విరుద్ధమైన అక్రమ నిర్మాణాలను తక్షణమే సీజ్ చేయాలి. ప్రమాదం పొంచి ఉన్న ఈ భవన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, సెల్లార్ అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి, అక్రమార్కులతో పాటు వారికి కొమ్ముకాస్తున్న లంచావతార అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## విఘ్న గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి..

- ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి..
- భక్తిశ్రద్ధలతో, ఐక్యతతో పూజలు నిర్వహించుకోవాలి..
- గణేష్ మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి..
- ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు..
- మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి..



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్**

విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతతో పాటు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలను జరుపుకోవాలని కోరారు.ఇకనుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.ఏకదంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లి విరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని అయన విజ్ఞప్తి చేశారు. వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన మండపాలవద్ద తగుజాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

## మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



- **మండపాల వద్ద పారిశుద్ధ ప్రమాణాలు పాటించాలి**
- **మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందస్తు చర్యలు తీసుకున్నప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించగలమని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలు, వాటికి వినియోగించే రసాయన రంగుల వల్ల నీరు కలుషితమవడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి ప్రకృతిని కాపాడాలని కోరారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు రెండు చొప్పున ఐదు అడుగుల మట్టి విగ్రహాలతో పాటు కాలుష్య నియంత్రణ మండలి అందించిన చిన్న మట్టి విగ్రహాలను కలిపి మొత్తం 1,000 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే వినాయక మండపాల వద్ద పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై మండపాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మండపాల పరిసరాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, చెత్తను తరలించేందుకు వచ్చే మున్సిపల్ ట్రాక్టర్ సిబ్బందికి అందజేయాలని తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మండపాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించాలని కోరుతూ ప్రజలకు చైర్‌పర్సన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రణయ్‌రెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీవిద్య, కరుణాకర్, పోలగాని మాధవి,కృష్ణ,రాపర్తి భవాని, శ్రీనివాస్,గుణగంటి హేమ, సతీష్,నాగుల వాసు,కొణతం రాజేష్,బత్తుల మంగమ్మ వెంకన్న,పిట్టల భవాని,రమేష్, గందూరి రమేష్,పిడమర్తి కీర్తి, లవన్,ఇందుశ్రీ,అనిల్, ఎలుగురి ఇందిరా వెంకన్న తదితరులు, మున్సిపల్ సిబ్బంది ఎం.డి. గౌసుద్దిన్, ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, యాదగిరి, అజిముద్దిన్, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు





## నెల నెల వైద్య శిబిరం విజయవంతం

- 256 మంది రోగులకు వైద్య సేవలు
- ఎన్.జి.ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కె.వి రామిరెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర ఫౌండేషన్ (ఎన్జీఆర్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనంలో నిర్వహించిన 45వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 256 మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో 127 మంది షుగర్, బీపీ పేషెంట్లకు, 60 మందికి కంటి వైద్య పరీక్షలు, 22 మందికి దంత వైద్య సేవలను డాక్టర్లు అందించారు. ఎలమద్ది హాస్పిటల్ కు చెందిన డాక్టర్ రాజేష్ ఎండి, (జనరల్ ఫిజీషియన్), సాయి కేర్ దంత వైద్యశాలకు చెందిన డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ హస్నాద్ బాబా ఎంబిబిఎస్, కంప్యూటర్ టెక్నాలజీతో కంటి వైద్య సేవలు అందించిన ఖమ్మం శరత్ మ్యాక్స్ విజన్ వారికి ఎన్జీఆర్ ఫౌండేషన్ కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు బీపీ చెక్ అప్ చేయడంలో సహకరించిన గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, షేక్ తానేషా, వసుంధర ఒకేషనల్ కాలేజీ విద్యార్థినులకు, ల్యాబ్ టెక్నీషియన్ ఈగ అనిల్ కుమార్, వైద్య సేవలు అందించిన వాలంటీర్ల బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో వైద్యం అత్యంత ఖరీదైన నేపథ్యంలో ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యానికి ధీటుగా సేవలు అందించాలనే లక్ష్యంతో సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలకే పరిమితం కాకుండా ఎన్జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్య సేవలతో విద్యార్థులు, యువతకు కంప్యూటర్ శిక్షణ, కుట్టు మిషన్ శిక్షణ వంటి అనేక సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాము. ఎన్జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. వైద్య శిబిరంలో రోగులకు బిపి, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలకు అవసరమైన మందులను కేవలం 100 రూపాయలకే అందిస్తున్నామన్నారు. ప్రతి నెల రెండవ ఆదివారం జరుగుతున్న వైద్య శిబిరంలో బిపి, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు కూడా డాక్టర్ వైద్య సేవలు అందిస్తారన్నారు. ప్రతినెల నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ప్రసాద్, షేక్ జమాల్, కొంగర నారాయణరావు, షేక్ రహీమ్, షేక్ అబ్దుల్, పి మల్లేశ్వరరావు, డి సైదారావు, ఎం నరసింహారావు, ఏ కోదండ రామారావు, కొత్త రాణి, కొత్త చంద్రశేఖర్, సామల మల్లికార్జునరావు, బొడ్డు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ ను నిరంతరాయంగా అందించాలి



- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు
- వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఆర్థిక సాయం తక్షణమే అందించాలి

**ఖమ్మం రాజముద్ర న్యూస్**

రైతులకు నాణ్యమైన విద్యుత్ ను నిరంతరాయంగా అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి 12,000 రూపాయల ఆర్థిక సహకారాన్ని తక్షణమే అందించాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక సిపిఐఎం కార్యాలయం రావేల సత్యనారాయణ భవనంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి తెలంగాణ రైతు సంఘం నేత సిపిఐఎం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభను తెలంగాణ రైతు సంఘం, పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దండ సైదారావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఎలినినో ప్రభావంతో సకాలంలో వర్షాలు లేక రైతులు సాగు చేసిన పంటలు నిలువునా ఎండిపోతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు సరిపోక బోర్లు బావులు కింద మాత్రమే అరకొరగా సాగుచేసిన పంటలకు కూడా ప్రభుత్వం నాణ్యమైన 24 గంటల విద్యుత్ను నిరంతరాయంగా అందించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎరువులు పంపిణీకి నూతనంగా ఫెర్టిలైజర్ యాప్ ను తీసుకురావడంతో, సాంకేతిక కారణాలతో పాటు యాప్ ను ఉపయోగించడంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నూతనంగా తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్ ను తక్షణమే రద్దుచేసి రైతులకు అవసరమైన యూరియా ఇతర ఎరువులను పాసు పుస్తకాల ఆధారంగా నేరుగా అందించాలని, 24 గంటల నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె రాణి, పుష్పలత, చెరువు నరసింహారావు, బి నాగేశ్వరరావు, పూర్ణ చంద్రప్రసాద్, జమాల్, మైకు బాబు, రహీమ్, రంజిత్ కుమార్, తానీషా, పెదపాక మల్లేశ్వరరావు, సామల మల్లికార్జున్, తిరపమ్మ, మంకెనపల్లి నరసింహారావు, ఏలూరి కోదండ రామారావు, తదితరులు పాల్గొన్నారు

## మట్టి వినాయకులతోనే పర్యావరణ పరిరక్షణ: వాసవి క్లబ్స్ పిలుపు

- డిస్ట్రిక్ట్ వి-106, రీజియన్-6 నేలకొండపల్లి ఆల్ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ

**ఖమ్మం రాజముద్ర న్యూస్**




ప్లాస్టిక్ మరియు రసాయన రంగుల వాడకంతో మానవాళికి, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో కాలుష్య నివారణ కోసం డిస్ట్రిక్ట్ వి-106, రీజియన్-6 నేలకొండపల్లి ఆల్ వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గణపతి నవరాత్రుల్లో భాగంగా శనివారం స్థానిక నేలకొండపల్లి పొట్టి శ్రీరాములు సెంటర్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాలు, రసాయన రంగులు నీటిని కలుషితం చేస్తున్నాయని, మట్టి విగ్రహాలతోనే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కార్పొరేట్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ రేగూరి హనుమంతరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా వైస్ గవర్నర్ కొత్త రమేష్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ దోసపాటి చంద్రశేఖర్, గల్లా కృష్ణారావు, గొల్ల నరసింహారావు, బోనగిరి రామశేషయ్య, నాగుబండి శ్రీనివాసరావు, గల్ల శ్రీనివాసరావు మరియు ఆల్ వాసవి క్లబ్స్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మట్టి వినాయకుడితోనే పర్యావరణ పరిరక్షణ: బలరాం యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:**

శేరిలింగంపల్లి నియోజకవర్గం, కొండాపూర్ శ్రీరాంనగర్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బలరాం యాదవ్ ఎకో ఫ్రెండ్లీ గణేష్ లను చిన్నపిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - "పర్యావరణాన్ని రక్షిస్తూ మట్టి వినాయకుడిని నిష్టగా తొమ్మిది రోజులు పూజించి గంగాజలంలో నిమజ్జనం చేయడం మన ఆచారం. కానీ ఇప్పుడు చాలామంది మట్టి వినాయకులను పెట్టడం మానేశారు. పర్యావరణాన్ని రక్షిస్తేనే మన భావి తరాలకు ఏదైనా చెప్పుకునే విధంగా ఉంటుంది" అని అన్నారు. తన వంతు కృషిగా ఎకో ఫ్రెండ్లీ గణేష్ పేరుతో చిన్నారులకు మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శేరిలింగంపల్లి ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.



# బియ్యం పురుగులు పడుతోందా? ఈ టిప్స్ పాటించండి..!

**బియ్యంలో పురుగులు పడటం ఎంతో సహజం. ముఖ్యంగా తెల్లపురుగుల కారణంగా బియ్యం పాడవుతూ ఉంటుంది. ఆ తర్వాత బియ్యం నుంచి పురుగులను వేరు చేయడం ఎంతో కష్టతరంగా ఉంటుంది. అయితే అసలు బియ్యంలో పురుగులు పడకుండా ఏం చేయాలి? ఎటువంటి చిట్కాలు పాటించాలి? తదితర విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం..**

**ఈ ఆకులను బియ్యంలో ఉంచండి..!**

బే ఆకులు బియ్యం పెట్టుకొనే కంటైనర్ లో ఉంచాలి. సహజంగా ఎండిన బే ఆకులు మార్కెట్ లో అందుబాటులో ఉంటాయి. వీటిని బియ్యం కంటెయినర్ లలో ఉంచాలి. ఓ నాలుగైదు ఆకులు ఉంచడం ద్వారా బియ్యం పురుగుపట్టే సమస్య తగ్గుతుంది. ఇక బియ్యం పురుగులు పట్టకుండా ఉండాలంటే లవంగాలు కూడా ఎంతో కీలకం. బే ఆకుల వలె, లవంగాలు ఒక ప్రత్యేకమైన సువాసనను కలిగి ఉంటాయి. ఇవి కూడా పురుగులను దూరంగా ఉంచుతాయి. వెల్లుల్లి నుంచి వచ్చే శక్తివంతమైన వాసన కారణంగా.. వెల్లుల్లి సహజ క్రిమి నిరోధకంగా కూడా పనిచేస్తుంది. మీ బియ్యం కంటైనర్‌లో కొన్ని పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలను ఉంచడం వల్ల పురుగులను దూరంగా ఉంచొచ్చు. వేప ఆకులను తరచుగా సహజ క్రిమి సంహారకంగా ఉపయోగిస్తారు. ఈ ఆకులు కీటకాలను తిప్పికొట్టే చేదు వాసనను విడుదల చేస్తాయి. మీ బియ్యం నిల్వలో కొన్ని ఎండిన వేప ఆకులను జోడించడం వలన పురుగుల నుంచి బియ్యాన్ని రక్షించుకోవచ్చు. అది కూడా సహజసిద్ధమైన మార్గంలో ఎలాంటి కెమికల్స్ లేకుండా పురుగులను అరికట్టవచ్చు. వేప ఆకులను బియ్యంలో వేయడం వల్ల బియ్యం రుచి ఏ మాత్రం మారదు. అలాగే ఇంలాంటి అపాయము జరగదు. ఈ టిప్స్ పాటించడం ద్వారా బియ్యం పురుగు పట్టకుండా జాగ్రత్త వహించవచ్చు.





## మ్యాగీ ఇలా ట్రై చేసి చూడండి.. పిల్లలు అస్సలు వదిలిపెట్టరు

**ఇంట్లో ఏ టిఫిన్ అందుబాటులో లేకపోతే తల్లులకు ఠక్కున గుర్తొచ్చే బ్రేక్ ఫాస్ట్ ఐటమ్ మ్యాగీ. అయితే ఈ మ్యాగీని కూడా కొంచెం వెరైటీగా చేస్తే పిల్లలు ఇష్టంగా లాగించేస్తారు. అలా అని నిత్యం మ్యాగీ కూడా చేయొద్దు. ఎందుకంటే ఇదంత హెల్దీ బ్రేక్ ఫాస్ట్ కాదు. అయితే మ్యాగీని కొంచెం వెరైటీగా ఎలా చేయాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. చిల్లీ గార్లిక్ మ్యాగీని పిల్లలకు చేసి పెట్టండి మరి.**

### చిల్లిగార్లిక్ మ్యాగీ తయారీకి కావాల్సిన పదార్థాలు

- పొట్టు తీసిన రెండు వెల్లుల్లి రెబ్బలు
- ఒక టీ స్పూన్ తరిగిన ఎండు మిరపకాయలు
- అర టీ స్పూన్ కారంపొడి
- అర టీ స్పూన్ మ్యాగీ మసాలా సాచెట్
- సన్నగా తరిగిన రెండు పచ్చిమిర్చి
- సన్నగా తరిగిన ఒక ఉల్లిపాయ
- ఒక టీ స్పూన్ సోయా సార్
- ఒక టీ స్పూన్ వైట్ వెనిగర్
- కొంచెం వంట నూనె

### చిల్లీ-గార్లిక్ మ్యాగీ తయారు చేసుకునే విధానం

మీడియం సైజు పాన్ లో కొంత నీరు పోసి.. అందులోనే ఒక టీ స్పూన్ వంటనూనె వేయాలి. కొంత నీరు మరిగాక.. అందులో ఒక ప్యాకెట్ మ్యాగీని వేసి మరిగించాలి. మరీ మెత్తబడకుండా, కొంచెం గట్టిగానే ఉండేలా మరిగించుకోవాలి. తరువాత ఒక పెద్ద జల్లెడ తీసుకొని.. మ్యాగీని నీటిని వేరు చేయాలి.

ఇప్పుడు ఒక మిక్సీలో పైన పేర్కొనబడిన పదార్థాలన్నిటినీ బాగా మిక్సీ పట్టుకోవాలి. అన్ని బాగా మెత్తగా గ్రైండ్ అయినట్లు నిర్థారించుకున్న తరువాతే వాటిని మిక్సీ గిన్నెలో నుంచి బయటికి తీసేయాలి. ఇప్పుడు ఒక చిన్న గిన్నె తీసుకొని, అందులో కొంచెం నూనెను పోసుకోవాలి. అందులోనే కొన్ని వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. నూనె, వెల్లుల్లి వేడెక్కిన తరువాత అందులో మనం మిక్సీ పట్టుకొని ఉంచిన మిశ్రమాన్ని వేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని, వెల్లుల్లి నూనెతో బాగా కలుపుకోవాలి. మిశ్రమం మొత్తం వెల్లుల్లికి, నూనెలో కలిసే విధంగా బాగా కలుపుకోవాలి. నూనె, మసాలా బాగా కలిసిపోయిన తరువాత అందులో మనం ముందుగానే వడగట్టిన మ్యాగీని వేసుకోవాలి. ఆ మ్యాగీకి మసాలా మొత్తం పెట్టుకునేలా బాగా కలుపుకోవాలి. అప్పుడే మ్యాగీకి సరైన ఫ్లేవర్ వస్తుంది. అదనపు క్రంచ్ కోసం మ్యాగీపై తెల్ల నువ్వులు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ఆకులను వేసుకోవాలి. అనంతరం కాసేపు మీడియం మంట మీద ఉంచి, మ్యాగీని మంట నుంచి కిందకు తీసేస్తే సరి. వేడి వేడిగా, ఎంతో రుచికరమైన చిల్లిగార్లిక్ మ్యాగీ రెడీ అయిపోతుంది.







## మతిమరుపును తగ్గించుకొనే చిట్కాలివే..!

**తీవ్రమైన పని ఒత్తిడి, జీవనశైలిలో వస్తున్న మార్పులు, సమయానికి తిండి, నిద్ర లేకపోవడం వంటి కారణాలతో చాలా మందికి మతిమరుపు వచ్చేస్తోంది. అయితే ఈ మతిమరుపు సమస్య నుంచి ఎలా బయటపడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. జ్ఞాపకశక్తిని ఎలా పెంచుకోవాలి? తదితర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం..**

**తగినంత నిద్ర పొందండి:**

నిద్రలేమి జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. అందుకే రోజు 78 గంటల నిద్ర పోవడం అలవాటు చేసుకోండి. గింజలు, పండ్లు, కూరగాయలతో పాటు ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారం జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది.విటమిన్లు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తినండి.

**క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి:**

వ్యాయామం మెదడులో రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. అంతే కాకుండా జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అందుకు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోండి.

**ఒత్తిడిని తగ్గించుకోండి:**

ఒత్తిడి జ్ఞాపకశక్తిని బలహీనపరుస్తుంది. యోగా, ధ్యానం లేదా ఇతర ఒత్తిడిని తగ్గించే పనులను ప్రాక్టీస్ చేయండి.

**తగినంత నీరు త్రాగండి:**

శరీరంలో నీరు లేకపోవడం జ్ఞాపకశక్తిని కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రతి రోజు 8 10 గ్లాసుల నీరు తాగండి.

**జ్ఞాపకశక్తిని మెరుగుపరిచే మార్గాలు..**

కొత్త విషయాలను నేర్చుకోండి: కొత్త భాషను నేర్చుకోండి. కొత్త సంగీత వాయిద్యాన్ని ప్లే చేయండి .లేదా కొత్త కళను నేర్చుకోండి. ఇది మెదడును చురుకుగా ఉంచుతుంది. పుస్తకాలు చదవడం వల్ల మెదడుకు పదును పెట్టి జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చెస్, సుడోకు లేదా ఇతర మెదడును ఉత్తేజపరిచే ఆటలు ఆడండి. మీ ఆలోచనలు, అనుభవాలను వ్రాయండి. ఇది జ్ఞాపకశక్తిని బలపరుస్తుంది.



## బాక్స్ బయటి నుంచి మెస్సీ మ్యాజిక్.. అద్భుతమైన గోల్‌తో అందరినీ మెస్మరైజ్ చేసిన సాకర్ దిగ్గజం!

- **మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మయామి, నాష్‌విల్లే మ్యాచ్ 2-2తో డ్రా**
- **బాక్స్ బయటి నుంచి అద్భుత గోల్‌తో మెస్సీ మయామికి ఆధిక్యం**
- **ఈ సీజన్‌లో 19వ గోల్ నమోదు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన మెస్సీ**
- **నాష్‌విల్లే తరఫున రెండు గోల్స్ చేసిన సామ్ సరిడ్జ్**
- **ఇంజురీ టైమ్‌లో గోల్ చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించిన నాష్‌విల్లే**

**స్పోర్ట్స్ డెస్క్ :**

మేజర్ లీగ్ సాకర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. నాష్‌విల్లే ఎస్సీతో జరిగిన మ్యాచ్‌లో పెనాల్టీ బాక్స్ బయటి నుంచి అద్భుతమైన గోల్ కొట్టి తన జట్టు ఇంటర్ మయామిని ఆధిక్యంలో నిలిపాడు. అయినప్పటికీ, ఈ మ్యాచ్‌లో మయామికి విజయం దక్కలేదు. ఆఖరి నిమిషంలో నాష్‌విల్లే గోల్ చేయడంతో మ్యాచ్ 22తో డ్రాగా ముగిసింది.

నిన్న జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలోనే నాష్‌విల్లే దూకుడు కనబరిచింది. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే సామ్ సరిడ్జ్ గోల్ చేసి నాష్‌విల్లేకు 10 ఆధిక్యాన్ని అందించాడు. అయితే, ఇంటర్ మయామి వెంటనే తేరుకుంది. 19వ నిమిషంలో మెస్సీ కొట్టిన కార్నర్ కిక్‌ను అడ్డుకోబోయిన నాష్‌విల్లే డిఫెండర్ రీడ్ బేకర్‌వైటింగ్, పొరపాటున బంతిని తమ సొంత గోల్ పోస్టులోకి పంపడంతో స్కోరు 11తో సమమైంది.

రెండో అర్ధభాగంలో మెస్సీ తన మార్క్ ఆటతో అభిమానులను ఉర్రూతలూగించాడు. 62వ నిమిషంలో సహచర ఆటగాడు రోడ్రిగో డి పాల్ నుంచి పాస్ అందుకున్న మెస్సీ, పెనాల్టీ ఏరియా బయటి నుంచి తన ఎడమ కాలితో కొట్టిన అద్భుతమైన షాట్ నేరుగా గోల్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ గోల్‌తో ఇంటర్ మయామి 21 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ సీజన్‌లో మెస్సీకి ఇది 19వ గోల్ కాగా, టాప్ స్కోరర్‌గా తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2023లో మయామి జట్టులో చేరినప్పటి నుంచి నాష్‌విల్లేపై ఆడిన 14 మ్యాచ్‌లలో మెస్సీకి ఇది 17వ గోల్ కావడం గమనార్హం.

మ్యాచ్ మయామి గెలుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో నాష్‌విల్లే అనూహ్యంగా పుంజుకుంది. ఇంజురీ టైమ్‌లో సామ్ సరిడ్జ్ మరోసారి గోల్ చేసి స్కోరును 22తో సమం చేశాడు. దీంతో గెలుపు అంచుల వరకు వచ్చి మయామి డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో ఈస్టర్న్ కాన్ఫరెన్స్ పట్టికలో అగ్రస్థానంలో ఉన్న నాష్‌విల్లే కంటే ఇంటర్ మయామి 9 పాయింట్ల వెనుకంజలో నిలిచింది. రెగ్యులర్ సీజన్‌లో మయామికి ఇంకా తొమ్మిది మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి.



## మోదీజీ.. హ్యాట్సాఫ్.. అంతర్జాతీయ దౌత్యం అంటే ఇదే

- **బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ దౌత్యానికి రవిశాస్త్రి జేజేలు**
- **పుతిన్, జిన్‌పింగ్‌తో కలిసి మోదీ మొక్కలు నాటుతున్న ఫొటో షేర్**
- **భారతీయుడిగా ఎన్నడూ ఇంత గర్వపడలేదంటూ ట్వీట్**
- **ఇది మునుపెన్నడూ చూడని దౌత్యమని ప్రధానిని కొనియాడిన శాస్త్రి**

**స్పోర్ట్స్ డెస్క్ :**

భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్, ప్రముఖ వ్యాఖ్యాత రవిశాస్త్రి ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ ప్రదర్శిస్తున్న అంతర్జాతీయ దౌత్యనీతిని కొనియాడాడు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ ఆసక్తికర పోస్ట్ చేశాడు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో కలిసి ప్రధాని మోదీ మొక్కలు నాటుతున్న ఫొటోను రవిశాస్త్రి పంచుకున్నాడు. సదస్సు జరుగుతున్న 'భారత్ మండపం'లో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఒక భారతీయుడిగా నేనెప్పుడూ ఇంత గర్వంగా ఫీల్ అవ్వలేదు. అధ్యక్షుడు పుతిన్, అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, మన అద్భుతమైన ప్రధాని నరేంద్ర మోదీ అంతా మాతృభూమి భారత్‌లో ఒకేచోట ఉన్నారు. ఇది మునుపెన్నడూ చూడని అంతర్జాతీయ దౌత్యం. మోదీ జీ.. మీకు నా హ్యాట్సాఫ్" అంటూ తన పోస్టులో పేర్కొన్నాడు.

భారత్ అధ్యక్షతన న్యూఢిల్లీలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో 18వ బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాల అధినేతలు ఇందులో పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిన్న బ్రిక్స్ నేతలు 'న్యూఢిల్లీ డిక్లరేషన్ 2026'ను ఆమోదించారు.

సదస్సు చివరి రోజైన నేడు ప్రధాని మోదీ పలు దేశాల అధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ జాబితాలో దక్షిణాఫ్రికా, కజకిస్థాన్, ఫిలిప్పీన్స్, ఈజిప్ట్, బురుండి, ఉగాండా, నైజీరియా వంటి దేశాలు ఉన్నాయి. భారత్ తరఫున 80 టెస్టులు, 150 వన్డేలు ఆడిన రవిశాస్త్రి, ఆ తర్వాత భారత జట్టుకు హెడ్ కోచ్‌గా కూడా పనిచేశాడు. ప్రస్తుతం భారత క్రికెట్‌లో ఓ ప్రముఖ వ్యాఖ్యాతగా, విశ్లేషకుడిగా కొనసాగుతున్నాడు.




# షమీ వయసుపై చర్చ.. కోహ్లీ, రోహిత్‌లను చూపిస్తూ చోప్రా కౌంటర్

- **టీమిండియాలో షమీ ఎంపికపై స్పందించిన మాజీ క్రికెటర్**
- **వయసు కారణంగా షమీని పక్కనపెట్టారన్న వాదన పూర్తిగా అసంబద్ధమన్న చోప్రా**
- **కోహ్లీ, రోహిత్‌లు ఆడుతున్నప్పుడు వయసు ఎలా కారణమవుతుందని ప్రశ్న**
- **ఫిట్‌గా లేకపోవడమే సమస్య తప్ప, వయసు కాదని పరోక్షంగా వ్యాఖ్య**

**స్పోర్ట్స్ డెస్క్ :**



భారత సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీని వయసు కారణంగానే జట్టులోకి తీసుకోవడం లేదనే వాదనలను మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా తోసిపుచ్చాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్లు ఇంకా జట్టులో కొనసాగుతున్నప్పుడు, ఒక్క షమీ విషయంలోనే వయసును కారణంగా చూపడం సరికాదని స్పష్టం చేశాడు.

36 ఏళ్ల షమీ గత ఏడాదిన్నరగా పదేపదే గాయాల బారిన పడుతూ జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యువ బౌలర్ల వైపు మొగ్గుచూపుతోంది. దీంతో షమీ కెరీర్ వయసు కారణంగానే ముగింపు దశకు వచ్చిందనే ప్రచారం జరుగుతోంది.

ఈ వాదనలపై తాజాగా స్పందించిన ఆకాశ్ చోప్రా "షమీకి వయసు ప్రతికూలంగా మారిందా? అది పూర్తిగా అసంబద్ధం. జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి అనుభవజ్ఞులను ఎంపిక చేస్తున్నప్పుడు, వయసు కారణంగా ఒకరిని తొలగించడంలో అర్థం లేదు. నా అంచనా ప్రకారం, షమీ ఎంపికలో వయసు అస్సలు కారణం కాదు. సెలక్టర్లు ఏదో ఒక రోజు కారణం చెబుతారు, కానీ అది మాత్రం వయసు అయి ఉండదు" అని ఒక వీడియోలో స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌తో షమీని పోల్చుతూ చోప్రా మరిన్ని విషయాలు వివరించాడు. "స్టార్క్ పూర్తి ఫిట్‌గా ఉంటూ నిరంతరం ఆడుతున్నాడు. జట్టులోకి వచ్చిన ప్రతీసారి బౌలింగ్ దాడిని ముందుండి నడిపించాడు. అతడి ఫామ్, ఫిట్‌నెస్, పదునుపై ఎలాంటి సందేహాలు లేవు" అని అన్నాడు. షమీ విషయంలో గాయాలు, ఫిట్‌నెస్ ప్రధాన సమస్యగా ఉన్నాయని పరోక్షంగా సూచించాడు.

షమీ చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో భారత జట్టుకు ఆడాడు. ఆ తర్వాత వరుస గాయాలతో బాధపడుతూ జట్టుకు అందుబాటులో లేకుండా పోయాడు.

## పాక్ పై క్లీన్‌స్వీప్.. డబ్ల్యూటీసీ రేసులో భారత్‌కు చేరువైన ఇంగ్లండ్

- **పాకిస్థాన్‌పై 3-0 తేడాతో టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్**
- **డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్‌కు చేరువైన ఇంగ్లీష్ జట్టు**
- **అట్టడుగు స్థానంలో మరింత దిగజారిన పాకిస్థాన్**
- **ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తొలి రెండు స్థానాల్లో కొనసాగింపు**
- **భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్**

**స్పోర్ట్స్ డెస్క్ :**



పాకిస్థాన్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్ చేసింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన చివరి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, సిరీస్‌ను 30తో కైవసం చేసుకుంది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ తన ఆరో స్థానాన్ని పటిష్ఠం చేసుకోవడమే కాకుండా, ఐదో స్థానంలో ఉన్న భారత్‌కు రేటింగ్ పరంగా మరింత చేరువైంది.

మూడో టెస్టులో 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్, జో రూట్, జోర్డాన్ కాక్స్ అర్ధశతకాలతో రాణించడంతో సునాయాసంగా విజయం సాధించింది. తమ సొంతగడ్డపై పాకిస్థాన్‌ను వైట్‌వాష్ చేయడం ఇంగ్లండ్‌కు ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈ విజయంతో ఇంగ్లండ్ డబ్ల్యూటీసీ పాయింట్ల సంఖ్య 74కు పెరిగింది. 16 మ్యాచ్‌ల అనంతరం వారి పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (PCT) 38.54 శాతానికి మెరుగుపడింది. గతంలో స్లో ఓవర్ రేట్ కారణంగా 14 పాయింట్ల కోతకు గురైన ఇంగ్లండ్, ఈ గెలుపుతో కాస్త ఊరట పొందింది. మరోవైపు, ఈ ఓటమితో పాకిస్థాన్ పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటికే పట్టికలో అట్టడుగున తొమ్మిదో స్థానంలో ఉన్న ఆ జట్టు పీసీటీ 16.67 శాతం నుంచి 14.81 శాతానికి పడిపోయింది. పాకిస్థాన్‌పై కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా 8 పాయింట్ల కోత పడింది.

డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 80 పీసీటీతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, దక్షిణాఫ్రికా (75 పీసీటీ), న్యూజిలాండ్ (72.22 పీసీటీ) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆశ్చర్యకరంగా బంగ్లాదేశ్ 55.56 PCTతో భారత్ కంటే ముందు నాలుగో స్థానంలో నిలిచింది. టీమిండియా 11 మ్యాచ్‌లలో 51.52 పీసీటీతో ఐదో స్థానంలో ఉంది. శ్రీలంక, వెస్టిండీస్ ఏడు, ఎనిమిది స్థానాల్లో ఉన్నాయి.

వచ్చే ఏడాది జూన్ 9 నుంచి 13 వరకు లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు అర్హత సాధిస్తాయి.

## చాలా దూకుడైన వ్యక్తి.. గంభీర్ మనస్తత్వం ఎలాంటిదో చెప్పిన అయ్యర్

- **హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనది బలమైన బంధమని చెప్పిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**
- **గంభీర్ దూకుడు స్వభావం, ఆటగాళ్లకు స్పష్టతనిచ్చే తీరు జట్టుకు మేలు చేస్తుందని వెల్లడి**
- **గతంలో కేకేఆర్ తరఫున తామిద్దరం కలిసి ఐపీఎల్ టైటిల్ గెలిచామని గుర్తు చేసిన అయ్యర్**
- **ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌పై దృష్టి పెట్టామని, ఒక్కో మ్యాచ్‌ను సీరియస్‌గా తీసుకుంటామని స్పష్టీకరణ**
- **ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై తొలిసారిగా ఆనందం వ్యక్తం చేసిన భారత కెప్టెన్**

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆటకు సంబంధించినంత వరకు భారత జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో తనకు బలమైన బంధం ఉందని, ఇది జట్టులో స్పష్టమైన కమ్యూనికేషన్‌కు, దూకుడైన ఆటతీరుకు ఉపయోగపడుతుందని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆదివారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న టీ20 మ్యాచ్‌కు ముందు శనివారం జరిగిన మీడియా సమావేశంలో అయ్యర్ మాట్లాడాడు. తమ ఇద్దరి మధ్య ఉన్న అవగాహన జట్టుకు ఎంతో మేలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశాడు.

గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తరఫున 2024 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్‌మెంటార్‌గా శ్రేయస్, గంభీర్ కలిసి పనిచేసి జట్టుకు టైటిల్ అందించిన విషయం తెలిసిందే. ఈ అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, గంభీర్ కోచింగ్ శైలిని అయ్యర్ ప్రశంసించాడు. "గంభీర్ చాలా దూకుడు స్వభావం ఉన్న వ్యక్తి. మైదానంలోకి అడుగుపెట్టాడంటే గెలుపు గురించే ఆలోచిస్తాడు. ప్రతి ఆటగాడు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరుకుంటాడు. జట్టు సభ్యుల్లో నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాడు. ఎవరి పాత్ర ఏంటనే దానిపై స్పష్టత ఇస్తాడు" అని అయ్యర్ వివరించాడు.

ఆటగాళ్లతో వ్యక్తిగతంగా మాట్లాడి వారిని అర్థం చేసుకునే గంభీర్ విధానం అద్భుతమని శ్రేయస్ కొనియాడాడు. "ప్రతి ఆటగాడితో వ్యక్తిగత సంబంధాన్ని కొనసాగించడం కోచింగ్‌లో చాలా ముఖ్యం. ఎందుకంటే జట్టులోని ఒక్కొక్కరిది ఒక్కో శైలి. గౌతీ భాయ్ (గంభీర్) మనస్తత్వం, అతడి ఆలోచనా విధానం నాకు బాగా తెలుసు. మేం ఎన్ని ఎక్కువ మ్యాచ్‌లు గెలిస్తే, మా మధ్య బంధం అంత బలపడుతుంది" అని అయ్యర్ తెలిపాడు.



ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే సిరీస్ గురించి మాట్లాడుతూ, ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోవట్లేదని స్పష్టం చేశాడు. "మేం భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించట్లేదు. ప్రస్తుతం తొలి మ్యాచ్‌పైనే మా దృష్టి ఉంది. ఆఫ్ఘనిస్థాన్ బలమైన జట్టు. వారి ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవం వల్ల ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. మా సన్నద్ధత కూడా చాలా బాగుంది. ఆసియా క్రీడలకు ముందు ఇలాంటి నాణ్యమైన జట్టుతో ఆడటం మాకు మంచి అవకాశం" అని అయ్యర్ పేర్కొన్నాడు.

తొలిసారిగా ఆసియా క్రీడల్లో పాల్గొనడంపై శ్రేయస్ అయ్యర్ ఉత్సాహం వ్యక్తం చేశాడు. "ఇది నాకు, జట్టుకు చాలా ఉత్సాహకరమైన సమయం. గత ఆసియా క్రీడల్లో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు ఇప్పుడు కూడా జట్టులో ఉన్నారు. అక్కడ ఇతర క్రీడలకు చెందిన అథ్లెట్లతో సంభాషించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక దేశంగా వెళ్లి, విజయంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాం" అని అయ్యర్ ముగించాడు.

రాజముద్ర తెలుగు దిన పత్రిక

# గలీజ్ మాటలు అన్నారు..



'బేబీ' చిత్రంతో ఒక్కసారిగా టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించి ఓవర్ నైట్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ వైష్ణవి చైతన్య ఇటీవల 'ఎపిక్' మూవీతో మరోసారి థియేటర్ల ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, ముఖ్యంగా 'బేబీ' సినిమా సమయంలో వచ్చిన విపరీతమైన నెగెటివిటీని గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనకు 'బేబీ' సినిమాతో ఒక్క రాత్రిలో ఎలాంటి సక్సెస్ రాలేదని వైష్ణవి స్పష్టం చేశారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, పలు చిత్రాల్లో చిన్న చిన్న క్యారెక్టర్ రోల్స్ చేస్తూ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నానని ఆమె తెలిపారు.

అయితే సినిమా విడుదలైన తర్వాత కొందరు తనను ఉద్దేశించి నోటికి వచ్చినట్లు గలీజ్‌గా మాట్లాడారని, థియేటర్ల వద్ద తన పోస్టర్లపై చెప్పులతో కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఆ దృశ్యాలన్నీ చూశాక ఎంతో బాధపడ్డానని తెలిపారు. సినిమా సూపర్ హిట్ అయిందని సంతోషించాలా? లేక తాను పడిన కష్టానికి ఈ రకమైన అవమానాలే బహుమతిగా వస్తున్నాయని బాధపడాలా? అనే తీవ్రమైన మానసిక వేదనలోకి వెళ్లిపోయానని వైష్ణవి అన్నారు. అయితే కాలం మారుతున్న కొద్దీ ఆ నెగెటివిటీ గురించి పట్టించుకోవడం మానేశానని, కేవలం తన పనిపై, సానుకూల అంశాలపై మాత్రమే దృష్టి పెట్టడం మొదలుపెట్టానని ఆమె వివరించారు.

ప్రముఖ వ్యాపారవేత్త, రామ్ చరణ్ సతీమణి ఉపాసన (Upasana) తన ఫిట్‌నెస్ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. 18ఏళ్ల వయసులోనే ఆమె 95 కిలోల బరువు ఉండేవారట. చరణ్‌తో పెళ్లి సమయంలోనూ తను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

"అమెరికాలో చదువుకునే రోజుల్లో కుటుంబానికి దూరంగా ఉండటం వల్ల బెంగగా ఉండేది. ఆ ఒత్తిడి నుంచి బయట పడేందుకు ఎక్కువగా తినేదాన్ని. దానివల్లే 18 ఏళ్ల వయసులో 95 కిలోల బరువు పెరిగా. ఆ తర్వాత బరువు తగ్గేందుకు చాలామంది డైటీషియన్లను కలిశా. రకరకాల డైట్లు ప్రయత్నించా. చివరికి అన్నం, గోధుమలకు బదులుగా ఓట్స్, హై ప్రొటీన్ ఆహారం తీసుకోవడం వల్ల మంచి ఫలితం కనిపించింది. కాలేజీకి నడుచుకుంటూనే వెళ్లేదాన్ని. అలా రోజూ 10 వేల అడుగులు నడవడం అలవాటు చేసుకున్నా"

"చరణ్ (Ramcharan)తో వివాహం జరిగిన సమయంలోనూ నా బరువుపై బాగా కామెంట్లు వచ్చాయి. 'చరణ్‌కు ఆమె తగిన జోడీ కాదు.. చాలా లావుగా ఉంది' అంటూ కొందరు కామెంట్లు చేశారు. మొదట్లో ఆ మాటలకు చాలా బాధపడేదాన్ని. కానీ, ఆ తర్వాత వాటి వల్లే మానసికంగా దృఢంగా మారాను. నా వాళ్లు ఏమనుకుంటున్నారు అనేది మాత్రమే నాకు ముఖ్యం. విమర్శలను పట్టించుకోకుండా వాటిని ఎలా ఎదుర్కోవాలో ఇప్పుడు బాగా తెలిసింది" అని ఉపాసన పేర్కొన్నారు.

## నేనూ బాడీ షేమింగ్ ఎదుర్కొన్నా.. బరువు ఎలా తగ్గానంటే?





# అట్లీతో సినిమా సన్నాహాల్లో షారుక్?

'కింగ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొణె కథానాయిక. డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత షారుక్ తదుపరి చిత్రాల గురించి ఇప్పటి వరకూ ఎలాంటి కొత్త కబురు వినిపించనే లేదు. ఈ నేపథ్యంలోనే ఆయన.. దర్శకుడు అట్లీ కాంబోలో వచ్చిన 'జవాన్' చిత్రానికి సీక్వెల్ వస్తుందని గతంలో వార్తలొచ్చాయి. అయితే తాజాగా వీరిద్దరూ మరో కొత్త ప్రాజెక్ట్ కోసం చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ జోరునే కొనసాగిస్తూ వీళ్ల కాంబోలో మరో చిత్రాన్ని రూపొందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ సన్నిహిత వర్గాల సమాచారం.



# అయినా కల నెరవేరలేదనిపిస్తుంది

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఎన్నో భాషల్లో విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు ప్రముఖ నటుడు మురళీ శర్మ (Murali Sharma). ఇటీవల ఆయన 'సూపర్ సుబ్బు' వెబ్ సిరీస్‌తో డిజిటల్ రంగంలోకి (ఓటీటీ) అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

''గతంతో పోలిస్తే ఇప్పుడు సినిమాల్లో చాలా మార్పులొచ్చాయి. ముఖ్యంగా కథ రాసే విధానంలో నాణ్యత బాగా పెరిగింది. ఒక సినిమాకు కథే ప్రాణం. నేను ఇప్పటి వరకు 250కి పైగా చిత్రాల్లో నటించానంటే నాకే నమ్మశక్యంగా లేదు. అయినా నా కల నెరవేరలేదనిపిస్తుంది. ఎందుకంటే, కెరీర్ ప్రారంభంలో ఇంత స్థాయిలో ఎదుగుతానని అనుకోలేదు. అంత పెద్ద కల కనే ధైర్యం కూడా చేయలేదు'' అని ఆయన సరదాగా చెప్పుకొచ్చారు.

సినిమాల్లో పాత్ర నిడివి గురించి తానెప్పుడూ ఆలోచించనని మురళీ శర్మ స్పష్టం చేశారు. ''ఇచ్చిన పాత్రకు ఎంతవరకు న్యాయం చేశాననేదే నాకు ముఖ్యం. సినిమాలో నా పాత్ర నిడివి ఎంత ఉందనేది ఎప్పుడూ చూడలేదు. అదృష్టవశాత్తూ నా సినీ ప్రయాణంలో ఎన్నో వైవిధ్యభరిత పాత్రలు దక్కాయి. తెలుగులో నన్ను తండ్రి పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గా భావిస్తుంటారు. అయితే, నేను ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలు చేస్తున్నానని ఫీల్ కాలేదు. దర్శకుడు నాకు ఏ పాత్ర ఇచ్చినా దానికి వంద శాతం న్యాయం చేయడమే నా బాధ్యతగా భావిస్తాను'' అని ఆయన వివరించారు.



# డిమాండ్ చేస్తే యాక్షన్‌కీ వెనకాడను!

"అడుక్కునే వాళ్లకి కూడా ఆదివారం ఉంటుంది కానీ ఈ అప్పుల వాళ్లకి ఉండదు" అంటున్నారు చిట్టిబాబు. మరి ఆయనెవరు.. తన కుటుంబ కథేంటి? తెలియాలంటే 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' చూడాల్సిందే. వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. నారా రోహిత్, నివేదా పేతురాజ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

"డబ్బుకీ.. సబ్బుకీ ఓ పోలికుంది. మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది. రెండోది ఆలోచించేలోపే అరిగిపోద్ది" అంటూ చిట్టిబాబుగా వెంకీ చెప్పే డైలాగ్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం అలరించేలా సాగింది. సగటు మధ్యతరగతి ఉద్యోగిగా చిట్టిబాబు జీవితాన్ని.. భార్య చేసే అప్పుల వల్ల తను పడే తిప్పల్ని ఈ ప్రచార చిత్రంలో ఫన్నీగా చూపించారు. వాళ్లంతా అకస్మాత్తుగా ఒక్కరాత్రిలో ధనవంతులుగా మారడం.. దానివల్ల ఆ కుటుంబానికి ఎదురైన చిక్కులు.. అందులో నుంచి బయట పడేందుకు భార్యాబిడ్డలతో కలిసి చిట్టిబాబు చేసిన సాహసాలు టీజర్‌లో ఆసక్తిరేకెత్తించాయి.

"నాకు ఫ్యామిలీ ఇమేజ్ ఉందని నాకు తెలుసు. కానీ, సిట్యువేషన్ డిమాండ్ చేస్తే యాక్షన్ చేయడానికి వెనకాడను" అంటూ వెంకీ చేసిన యాక్షన్ హంగామా ఆకట్టుకుంది. "నది గట్టు దాటితే వరదంటారు. అదే సముద్రం దాటితే ఉప్పెనంటారు. కానీ, సామాన్యుడు దాటితే.! బలమైన పదం.. స్ట్రాంగ్ సౌండ్ వచ్చేది మీరే వెతకండి సర్" అంటూ ఆఖర్లో ఓ పోలీసుతో వెంకటేశ్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: తమన్, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: రవి కె చంద్రన్.

# కాకా.. ధూమ్ ధమాకా!

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డేమారి, నరేశ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కించిన చిత్రం 'క్రేజీ కళ్యాణం'. బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్రం నుంచి పెళ్లి బరాత్ గీతాన్ని విడుదల చేశారు.

''కాకా ధూమ్ ధమాకా.. లగ్గం ఇంట్ల పందిర్లే పడ్డాక'' అంటూ హుషారుగా సాగిన ఈ పాటకు సురేశ్ బొబ్బిలి స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యమందించారు. ఈశ్వర్ పెంటి నృత్యరీతులు అందించారు. ఈ పాటలో అనుపమ వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి కూర్పు: శ్రావణ్ కటికనేని, ఛాయాగ్రహణం: శ్యామ్ దూపాటి.



# టొరంటో అంతర్జాతీయ చిత్రోత్సవంలో...డోరతి



కథానాయిక కీర్తి సురేశ్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రాధారులుగా రూపొందిన తమిళ సినిమా 'డోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతిదేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించారు. తాజాగా ఈ సినిమా టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(టిఫ్)2026లో ప్రదర్శితమైనట్లు సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది చిత్రబృందం.

ప్రీమియర్ అనంతరం ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. దీంతో సినీ బృందం ఇన్‌స్టాలో 'ఈ క్షణాన్ని పంచుకోవడం మరపురానిది. ఈ చిత్రానికి జీవం పోసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు' అనే క్యాప్షన్‌తో ఫొటోలని పంచుకుంది. దశాబ్ద కాలంలో టిఫ్‌లో ప్రదర్శితమైన తొలి తమిళ చిత్రంగా నిలిచింది 'డోరతి'. 90ల కాలంలో చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన డోరతి అనే మహిళ చుట్టూ తిరిగే కథ ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. ఈ సినిమా ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.

Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajgiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com